విశాలాంధ్ర

కృష్ణా, ఎన్టీఆర్ గుంటూరు, పల్నాడు

సోమవారం 29 సెప్టెంబరు 2025 8 పేజీలు

నేడు మూలా నక్షత్రం

- సుమారుగా 2 లక్షల మంది భక్తులు వస్తారని అంచనా
- నేడు అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించనున్న సీఎం చంద్రబాబు
- పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు
- మంచినీటి బాటిళ్ళు, పాలు, బిస్కెట్లు అదనంగా సిద్ధం
- ఏర్పాట్లపై మంత్రుల బృందం, అధికారుల సమీక్ష

విశాలాంధ్ర-విజయవాడ: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో కీలక జన్మ నక్షత్రమైన మూల నక్షత్రం రోజున శ్రీ సరస్వతి దేవి అలంకారంలో దర్శనం ఇవ్వనున్న అమ్మవారిని దర్శించుకునేందుకు దాదాపుగా 2లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున అధికారులు పటిష్ట ఏర్పాట్లు చేపట్టారు. శ్రీ చక్ర నవార్చన వంటి ప్రత్యేక పూజలు చేయించుకునేవారి కోసం భవాని ఘాట్, గాంధీ మ్యూజియం నుంచి వాహనాలు ఏర్పాటు చేశారు. ఉదయం 7 నుంచి 8 మధ్య ఆ వాహనాలలోనే దేవస్థానానికి రావాలని, ఇతర వాహనాలకు అనుమతి లేదు. మధ్యాహ్నం 3.30 నుంచి 4.30గంటల మధ్య మిగతా 2 లో ...

నేటీ అలంకారం శ్రీ సరస్వతీదేవి



విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): శరన్నవ రాత్రి మహోత్సవాల్లో భాంగా శ్రీ కనకదుర్గమ్మవారు శ్రీ సరస్వతీ దేవిగా అలంకారములో దర్శనమిస్తారు. మూలా నక్షత్రం శ్రీఅమ్మవారి జన్మనక్షత్రము. మహాకాళి, మహాలక్ష్మి, మహాసరస్వతిగా శక్తిస్వరూపాలతో దుష్టసంహారం చేసిన శ్రీదుర్గాదేవికి శరన్నవరాత్రి ఉత్సవాలలో మూలానక్షత్రం రోజున వాగ్దేవతామూర్తి అయిన సరస్వతీ అవతారంలో భక్తులను అనుగ్రహిస్తారు. సరస్వతీదేవిని సేవించడంతో విద్యార్థులు సర్వవిద్యలలో విజయం పొందుతారు. మూలానక్షత్రం నుండి విజయ దశమివరకు విశేష పుణ్య దినాలుగా భావించి భక్తులు శ్రీదుర్గమ్మను ఆరాధిస్తారు. భక్తజనుల అజ్ఞానాన్ని పారద్రోలి జ్ఞానజ్యోతిని వెలిగించే జ్ఞాన ప్రదాయిని శ్రీ సరస్వతీదేవి. శ్రీ సరస్వతీదేవి దర్శనం అఖిల విద్యాభ్యుదయ ప్రదాయకము.

వరద ఉధృతి దృష్ట్యా అప్రమత్తం

కృష్ణానదీ వరద ప్రభావిత గ్రామాల్లో కలెక్టర్ పర్యటన

విశాలాంధ్ర-తుళ్లూరు : తుళ్లూరు మండలంలోని తాళ్లయ్యపాలెం లంక గ్రామాన్ని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా శనివారం పర్యటించారు. కృష్ణా నదిలో వరద ప్రవాహం పెరగడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆమె గ్రామస్తులకు సూచించారు. ఇప్పటికే నదిలోకి 6 లక్షల క్యూసెక్కుల వరద నీరు వస్తోందని, పరిస్థితులు మరింత విషమించే అవకాశం ఉన్నందున రిస్క్ తీసుకోవద్దని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. గ్రామ ప్రజలందరూ వెంటనే పునరావాస కేంద్రాలకు తరలివెళ్లాలని ఆదేశాలు జారీ చేశారు. పునరావాస కేంద్రాలకు వెళ్లేందుకు వాహనాలను అధికారులు ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. వరద ప్రభావిత కుటుంబాల సురక్షిత స్థలాలకు తరలింపుపై కలెక్టర్ స్వయంగా పర్యవేక్షిస్తున్నారు.

యోగాను దినచర్యలో భాగం చేసుకోవాలి

'ఫిట్ ఇండియా'లో ఎస్పీ వి.విద్యాసాగర్‌నాయుడు

విశాలాంధ్ర బ్యూరో మచిలీపట్నం : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆద్వర్యంలో పోలీస్ శాఖలో పనిచేస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బంది మానసిక ఒత్తిడి, ఆరోగ్యపరమైన మిగతా 2 లో ...

జాషువాకు నివాళులు

విశాలాంధ్ర-వినుకొండ : తెలుగు సాహిత్యంలో కొత్త ఒరవడితో నవయుగ కవిచక్రవర్తి గుర్రం జాషువా వర్ణ వివక్ష, కుల నిర్మూలన కోసం ప్రజా చైతన్యం కోసం అనేక రచనలు చేశారని సిపిఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతీ వరప్రసాద్ అన్నారు. పద్మభూషణ్ గుర్రం జాషువా 130వ జయంతి సందర్భంగా వినుకొండ పట్టణంలోని గుర్రం జాషువా ప్రాంగణంలోని ఆయన విగ్రహం వద్ద సిపిఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొని గుర్రం జాషువా విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాద్ మాట్లాడుతూ. ఫిరదౌసి, గబ్బిలం, క్రీస్తు చరిత్ర లాంటి అనేక ప్రతిష్టాత్మకమైన రచనలు చేసిన జాషువా పురస్కారాలు, బిరుదులు పొందారని, కులానికి సంబంధించిన మొదటి మహోన్నత వ్యక్తి గుర్రం జాషువా అని ఆయన మిగతా 2 లో ...

విద్యతోనే కురుబల అభివృద్ధి

5న తిరుపతిలో భక్త కనకదాస విగ్రహావిష్కరణ : రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

విశాలాంధ్ర-మంగళగిరి : విద్యతోనే కురుబల అభివృద్ధి సాధ్యమని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత స్పష్టం చేశారు. ఐక్యమత్యంతో కురుబలు మెలగాల్సిన అవసరముందన్నారు. అమరావతిలో భక్త కనకదాస విగ్రహ ఏర్పాటుకు కృషి చేస్తున్నామన్నారు. మంగళగిరిలో ఓ కన్వెన్షన్ సెంటర్‌లో మంగళవారం నిర్వహించిన కురుబ, కురువ, కురుమ సామాజిక వర్గీయుల రాష్ట్ర స్థాయి ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి సవిత పాల్గొని ప్రసంగించారు. కురుబ, కురుమ, కురువ సామాజిక వర్గీయుంతా ఒక్కటేనని, వారంతా ఐక్యంగా ఉంటేనే అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. విద్యతోనే పేదరికం దూరమవుతుందని, అన్ని రంగాల్లోనూ ఉన్నతి సాధ్యమవుతుందని తెలిపారు. కురుబ, కురుమ, కురువ పేద విద్యార్థులకు అండగా నిలుద్దామని, అందుకు తాను వ్యక్తిగతంగా ఎల్లవేళలా సాయమందిస్తానని తెలిపారు. అమరావతిలో భక్త కనకదాస కాంస్య విగ్రహం ఏర్పాటుకు మిగతా 2 లో ...

సమసమాజ నిర్మాత జాషువా

జాషువా 130వ జయంతి వేడుకల్లో మంత్రి కందుల దుర్గేష్

విశాలాంధ్ర-విజయవాడ: కలాన్ని ఆయుధంగా వాడుకొని సమాజంలోని రుగ్మతలను రూపుమాపిన వ్యక్తి మహాకవి గుర్రం జాషువా అని రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఆదివారం నగరంలోని కలెక్టరేట్ కార్యాలయంలో పింగళి వెంకయ్య సమావేశ మందిరం నందు ఏపీ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పద్మభూషణ్ గుర్రం జాషువా 130వ జయంతి వేడుకల్లో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి నవయుగ కవి చక్రవర్తి జాషువా చిత్రపటానికి మిగతా 2 లో ...

(మొదటి పేజీ తరువాయి)

విద్యతోనే కురుబల అభివృద్ధి

కృషి చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఇప్పటికే ఇదే విషయమై సీఎం చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లినట్లు వెల్లడించారు. తిరుపతిలో భక్త కనకదాస పీఠం ఏర్పాటుపైనా సీఎం చంద్రబాబుతో చర్చించినట్లు తెలిపారు. వచ్చే నెల అయిదో తేదీన తిరుపతిలో భక్త కనకదాస కాంస్య విగ్రహం ఏర్పాటు చేయనున్నామని, ఈ కార్యక్రమానికి పెద్దఎత్తున తరలిరావాలని ఆమె పిలుపునిచ్చారు. సీఎం చంద్రబాబు ప్రోత్సాహం తోనే కురుబలకు ఎంతో మేలు కలుగుతోందని మంత్రి సవిత తెలిపారు. కురుబల రాజకీయ, ఆర్థిక, సామాజిక ఉన్నతికి ఆయన ఎంతగానో వెన్నుదన్నుగా నిలుస్తున్నారన్నారు. కురుబలకు చెందిన ఇద్దరు ప్రజాప్రతి నిధులు ఎంపీలుగానూ, తాను ఎమ్మెల్యేగా, మంత్రిగా కూడా సేవ చేస్తున్నట్లు తెలిపారు. ఇదంతా సీఎం చంద్రబాబు వల్లేనన్నారు. గత ఎన్నికల్లో కురుబలకు ఇచ్చిన హామీల అమలుకు కృషి చేస్తానని వెల్లడిం చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే కురుబలను గెలిపించుకునే బాధ్యత అందరిపైనా ఉందన్నారు. తిరుపతిలో వచ్చే నెల 5న జరిగే భక్త కనకదాస కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు. ఇందుకు సంబంధిం చిన పోస్టర్‌ను మంత్రి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కురుబ కార్పొరేషన్ చైర్మన్ మాన్వి దేవేంద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

సమసమాజ నిర్మాత జాషువా

పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెలుగు సాహిత్యం కోసం కృషి చేస్తున్న డా. కనకదుర్గ ప్రసాద్ రావు, డా. పాలపర్తి శ్రీధర్,మీసాల లక్ష్మణ్, పొట్లూరి హరికృష్ణ, కె.గురువమ్మలకు కవికోకిల పద్మభూషణ్ గుర్రం జాషువా 2025 పేరిట ఒక్కొక్కరికి 50 వేల రూపాయల నగదు పురస్కారాలను మంత్రి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీతలను ప్రత్యేకంగా అభినందించారు. పద్మశ్రీ, పద్మభూషణ్ ల కన్నా గుర్రం జాషువా అవార్డులు పొందడం గొప్ప విషయంగా భావించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సాంస్కృతిక, సృజనాత్మక సమితి చైర్ పర్సన్ తేజస్వి పొడపాటి, డైరెక్టర్ రేగుళ్ల మల్లిఖార్జున రావు, ఎన్టీఆర్ కలెక్టర్ జి. లక్ష్మీశ, నాటక రంగ అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, సాంస్కృతిక శాఖ అధికారులు సుమన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

యోగాను దినచర్యలో భాగం చేసుకోవాలి

సమస్యలను అధిగమించాలనే ఉద్దేశ్యంతో 'ఫిట్ ఇండియా' కార్యక్రమాన్ని ఆదివారం ఏఆర్ పోలీస్ పెరేడ్ మైదానంలో జిల్లా ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు ఆదేశాల మేరకు సిబ్బందితో యోగ సాధన చేయించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మానసిక ఒత్తిడిని అధిగమించాలంటే యోగాను దినచర్యలో భాగంచేసుకోవాలన్నారు. నిరంతరం యోగ సాధన చేయడం వలన నూతన ఉత్తేజం సొంతమౌతుందని, దీంతో మరింత ఉత్సాహంగా విదులు నిర్వర్తించగలమని సిబ్బందికి తెలిపారు.

జాషువాకు నివాళులు

అన్నారు. గబ్బిలం కావ్యంలో వర్ణ వివక్షకు గురైన ఒక మనిషి తన బాధను గబ్బిలం ద్వారా గర్భగుడి లోపల ఉన్న భగవంతునికి తెలియజేసే తన ఆవేదన చదువరులకు కంటతడి పెట్టిస్తుందని ఆయన వివరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ సిపిఐ కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు, సిపిఐ నూజెండ్ల మండల కార్యదర్శి ఎ. పవన్ కుమార్, వినుకొండ మండల కార్యదర్శి కె. మల్లికార్జునరావు, ఏఐవైఎఫ్ నియోజకవర్గ కార్యదర్శి దారి వేముల, బాబు, చింతపల్లి రవి, సోదాల సాంబయ్య, షేక్ మీరావలి, కరీముల్లా, జిల్లి వెంకటేశ్వర్లు, గురు స్వామి నాగిరెడ్డి, పాల్గొన్నారు.

ఎక్స్‌రే అధ్యక్ష, కార్యదర్శులుగా

కొల్లూరి, ఆంజనేయరాజు

ఎక్స్ రే నూతన కార్యవర్గం ఎన్నిక

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్) : ఎక్స్‌రే సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ నూతన అధ్యక్షులుగా కొల్లూరి, ప్రధాన కార్యదర్శిగా బోడి ఆంజనేయ రాజు, కోశాధికారిగా చామర్తి వెంకట సుబ్బయ్య ఏకగ్రీవంగా ఎన్నిక అయ్యారు. ఆదివారం ఉదయం స్వాతంత్ర్య సమరయోధుల భవనంలో జరిగిన ఎక్స్ రే సర్వసభ్య సమావేశం లో లినూతన కార్యవర్గం 2025-26కి ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. సంస్థ ఉపాధ్యక్షులుగా కందికొండ రవికిరణ్, అప్పన సాయిబాబు, డాక్టర్ బ్రహ్మదేశం వసంత కుమార్, పొత్తూరి సీతారామారావు, సంయుక్త కార్యదర్శులుగా గోపు రాము, గుర్రం ఏడుకొండలు, సాహిత్య కార్యదర్శిగా సింగంపల్లి అశోక్ కుమార్, సాంస్కృతిక కార్యదర్శులుగా డాక్టర్ దావులూరి కైలాసరావు, వి సర్వేశ్వరరావు, సేవా కార్యదర్శులుగా కొల్లా జయశ్రీ, వనమా విశ్వేశ్వరరావు, మహిళా కార్యదర్శులుగా సామినేని శైలజ, డి శ్రీవల్లి, పిఆర్ఓలుగా బిఎస్ఆర్ వర్మ, బాల గంగాధర్ నామాల, కార్యవర్గ సభ్యులుగా కొల్లూరి కనకవల్లి, మల్లిక, చామర్తి శ్రీరామచంద్రమూర్తి, ఎస్ కృష్ణమూర్తి కన్నన్, గంటేడి సుజాత, చిల్లకూరి నాగలక్ష్మి ఎన్నిక అయ్యారు. సంస్థ వార్షికోత్సవం అక్టోబరు నెల 26న ప్రముఖ సినీహీరో అతిథిగా జరుపనున్నట్లు కార్యదర్శి బి ఆంజనేయ రాజు తెలిపారు.

నేడు మూలా నక్షత్రం

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు. ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు, భక్తులు పెద్ద సంఖ్యలో రానున్న నేపథ్యంలో మంత్రుల బృందం ఆదివారం సాయంత్రం కమాండ్ కంట్రోల్ రూమ్ లో సమావేశమై సమీక్ష నిర్వహించారు. దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత.. దేవాదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్ర మోహన్, జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ, పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్ బాబు, ఆలయ ఈవో వీకే శీనా నాయక్ పాల్గొన్నారు. సరస్వతీ దేవి అలంకారంలో అమ్మవారి దర్శనానికి రాత్రి 11 గంటల నుంచి భక్తులను క్యూలైన్లో దర్శనం కోసం పంపే ఏర్పాటు చేశామని గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారి దర్శనానికి వచ్చే అవకాశం ఉందని హెూల్డింగ్ ఏరియాలో భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశామని అధికారులు వెల్లడించారు. క్యూలైన్లు సజావుగా సాగేలా, అమ్మ దర్శన భాగ్యం త్వరితగతిన లభించేలా ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. మంచినీటి బాటిల్లతో పాటు పాలు, బిస్కెట్లు వంటి వాటిని అదనంగా సిద్ధంగా ఉంచినట్లు పేర్కొన్నారు. ఎంతమంది వచ్చినా కోరినన్ని లడ్డూలు అందించేందుకు ఏర్పాటు చేశామన్నారు. తాత్కాలిక మరుగుదొడ్ల సంఖ్యను పెంచడం జరిగిందని, పారిశుధ్య చర్యలకు అదనపు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ప్రకాశం బ్యారేజ్ కి వరద నీరు పోటెత్తుతున్న నేపథ్యంలో ఘాట్ల వద్ద తీసుకున్న చర్యలు పైనా చర్చించారు. జల్లు స్నానాలు చేసేందుకు భక్తులకు కల్పించిన సౌకర్యాలను వివరించారు. రేపు భక్తుల రద్దీ దృష్ట్యా చిన్న చిన్న ఆంక్షలు పెడుతున్నామని ఆర్జిత సేవలకు వచ్చే వారు నిర్ణీత గడువు లోగా చేరుకోవాలని ఆలయానికి సంబంధించిన వాహనాల్లోనే కొండపైకి వచ్చేలా ఏర్పాట్లు చేశామని వివరించారు.

మహాచండిదేవీగా దుర్గమ్మ

అమ్మ దర్శనానికి కిక్కిరిసిన క్యూలైన్లు

ఏర్పాట్లపై భక్తజనం సంతృప్తి

విశాలాంధ్ర-విజయవాడ: ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న నవరాత్రి ఉత్సవాలు విజయవంతంగా సాగుతున్నాయి. 7వ రోజు శ్రీ మహా చండీ దేవి అవతారంలో దుర్గామాత ఆదివారం భక్తులకు దర్శనమిస్తున్నారు. సాధారణంగానే భక్తుల తాకిడి ఎక్కువగా ఉండే నవరాత్రి ఉత్సవాలు నేడు ఆదివారం కావడంతో ఉదయం 3 గంటల నుంచి భక్తజన సందోహం తాకిడి పెరిగింది. ఈరోజు భక్తజన సందోహం ఎక్కువగా ఉంటుందని ఊహించిన ఆలయ అధికారులు ఇంద్రకీలాద్రిపై విధులు నిర్వహిస్తున్న వివిధ శాఖల అధికారులతో సమన్వయం చేసుకోవడంతో భక్తులకు ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రశాంతంగా దర్శనం చేసుకుంటున్నారు. ముఖ్యంగా దేవాదాయ ధర్మాదాయ శాఖ, పోలీస్ శాఖ, నగరపాలక సంస్థ, రెవెన్యూ, వైద్య ఆరోగ్య శాఖల అధికారులు సాధారణ భక్తులకు అవసరమైన వసతుల కల్పనలో ఎక్కడా రాజీ పడకుండా ఏర్పాట్లు చేయడం విశేషం. సాధారణ భక్తులకు ఎక్కడా ఎటువంటి ఇబ్బంది కలగకుండా స్వయంగా చూసేందుకు కలెక్టర్ జి.లక్ష్మీశ ప్రతిరోజు సాధారణ భక్తులతో కలిసి క్యూ లైన్ లో వెళ్తున్నారు. భక్తుల నుంచి అభిప్రాయాలను తెలుసుకుంటున్నారు. ఎక్కడైనా ఏదైనా లోపం కనిపిస్తే యుద్ధ ప్రాతిపదికన పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారు. అధికారులు ప్రతిక్షణం అప్రమత్తంగా ఉంటున్నారు.అక్టోబర్ రెండవ తేదీ వరకు జరగనున్న ఈ ఉత్సవాలలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా కలెక్టర్, పోలీస్ కమిషనర్, శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఈవో వీకే శీనానాయక్ లు ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు.

ఏ ప్లస్ కన్వెన్షన్‌లో దసరా శరన్నవరాత్రి సంబరాలు

విశాలాంధ్ర - విజయవాడ లబ్బీపేట : దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని వి వైబ్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఏ ప్లస్ కన్వెన్షన్ సెంటర్లో ఏర్పాటైన దాండియా, గార్బా నృత్యాలు కోలాహలంగా సాగాయి. ఉత్తరాది రాష్ట్రాల తరహాలోనే ఇక్కడ కూడా దాండియా నృత్యం ప్రాచుర్యం పొందడంతో ఆడమగ, చిన్న, పెద్ద వయోబేధాన్ని విస్మరించి ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. నిర్వాహకుల అంచనాలకు మించి ఈ నృత్యానికి విజయవాడ వాసుల నుండి విశేష స్పందన లభించింది. ఫుల్ జోష్ గా సాగిన దాండియా నృత్యాలు గంటల తరబడీ కొనసాగాయి. ఉత్తరాది రాష్ట్రాల్లో దసరా శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా ఎక్కడ చూసినా దాండియా, గార్బా ఆటలే కనిపిస్తాయి. ఆడ, మగ అనే తేడా లేకుండా ఈ నృత్యంలో పాల్గొని పెద్దఎత్తున సందడి చేస్తారు. యువతులంతా దాండియా స్టిక్స్ పట్టుకుని పాటకు తగ్గట్లుగా వాటిని ఒకదానికొకటి తగిలిస్తూ జంటగా ఆడుతూ.. సవ్య, అపసవ్య దిశలలో తిరుగుతుంటారు. ఈ దాండియా నృత్యం ఇటీవల కాలంలో దక్షణాది రాష్ట్రాల్లో సైతం ప్రాచుర్యం పొందుతోంది. ఈ క్రమంలో బెజవాడ దసరా ఉత్సవాల్లో కూడా దాండియా ప్రత్యేక ఆకర్షణగా మారుతోంది. స్థానిక స్టెల్లా కళాశాల ఇండోర్ స్టేడియంలో ఏర్పాటైన దాండియా నైట్ ఎంతో ఆనందంగా, ఉత్సాహంగా కొనసాగింది. వందలాది మంది జంటలు ఈ దాండియా, గార్బా నృత్యంలోపాల్గొని డీజే, డోల్ కు అనుగుణంగా నృత్యాలు చేశారు. ఈ నృత్యంలో అన్నిరకాల ఒత్తిళ్లను తగ్గించి మానసిక ప్రశాంతతను కూడా అందిస్తుందని నిర్వాహకులు రాగ వీణ అన్నారు.

నవయుగ కవి చక్రవర్తి జాషువా

విశాలాంధ్ర-విజయవాడ: సామాజిక ప్రయోజనం ఆశించి రచనలు చేసిన ప్రజల హృదిలో సుస్థిర స్థానం సంపాదించుకున్న నవయుగ కవి గుర్రం జాషువా అని ప్రముఖ సాహితీవేత్త వేముల హజరత్తయ్య గుప్తా అన్నారు. ఆదివారం తెలుగు కళా రత్నాలు సాంస్కృతిక సేవా సంస్థ గుర్రం జాషువా జయంతి వేడుకలను నగరంలోని కౌతా కళా వేదిక లో నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన మాట్లాడుతూ ఛీత్కారాలు పొందిన చోటే తన సాహిత్య విలువలతో సత్కారం పొందిన పద్మ భూషణుడు, కవిత్వాన్ని ఆయుధంగా చేసుకొని మూఢాచారాల పై తిరగబడ్డ మహా వ్యక్తిత్వ విరాజితుడు గుర్రం జాషువా అన్నారు. అనంతరం సాంస్కృతిక, సాహిత్య, కళా సేవ చేస్తున్న, స్వతహాగా కవి, గాయకుడు, నటుడు అయిన గుప్తాను ప్రత్యేకంగా గజమాల తో నిర్వాహకులు సన్మానించారు. తొలుత హజరత్తయ్య గుప్తా ,జి. మురళీ కృష్ణ చేతుల మీదుగా వివిధ కవులను, గాయకులను రత్నం , ఉషారాణి లను సత్కరించారు.

నగరవాసులను ఆకర్షిస్తున్న లేపాక్షి

విశాలాంధ్ర-విజయవాడ: ఆంధ్రప్రదేశ్ హ్యాండీ క్రాఫ్ట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నగరంలోని లేపాక్షి దుకాణాల్లో ఏర్పాటు చేసిన ప్రదర్శన, విక్రయాలకు విశేష స్పందన వస్తోందని మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ విశ్వ ఒక ప్రకటనలో తెలిపారు. ఉడ్ కార్వింగ్, బొబ్బిలి వీణ, ఏటికొప్పాక, కొండపల్లి బొమ్మలు, కలంకారి చీరలు, బెడ్ షీట్స్, ఇత్తడి విగ్రహాలు, లోహ కళాఖండాలు, రాగి వస్తువులు, ఇంకా మరెన్నో సరికొత్త డిజైన్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. డిస్కౌంట్ సేల్లో భాగంగా అక్టోబరు 1 వ తేది వరకు ప్రతీ వస్తువు కొనుగోలుపై ప్రత్యేక డిస్కౌంట్ ఇస్తున్నట్లు తెలిపారు. గాంధీనగర్, ఐలాపురం ఎదురుగా ఉన్న లేపాక్షి షోరూమ్ ను ప్రతి ఒక్కరూ సందర్శించి ప్రదర్శనలలో ఉన్న అపురూప కళాఖండాలను కొనుగోలు చేసి హస్త కళకారుల జీవనోపాధికి సహకరించాలని కోరారు.

గ్రావెల్ సరఫరా చేస్తున్న ట్రాక్టర్ సీజ్

విశాలాంధ్ర, విస్సన్నపేట : మండలంలోని పుట్రేల పంచాయతీ శివారు కోటిపల్లి గ్రామంలోని ఉషోదయా ప్రాజక్టు భూముల నుంచి అక్రమంగా గ్రావిల్ తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఆదివారం అధికారులు సీజ్ చేశారు. గ్రామంలో గత కొద్దిరోజులుగా అక్రమంగా గ్రావిల్ రవాణా జరుగుతోందని, అధికారులు పట్టించుకో వటం లేదంటూ గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకుడు బొద్దు మారేశ్వర రావు సామాజిక మాధ్యమాల్లో పోస్టింగ్‌లు పెట్టడంతో అధికారులు స్పందించి, గ్రావిల్ తరలిస్తున్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

బెజవాడలో ఎంపీఎంఏ డ్రగ్ స్వాధీనం !

బెంగళూరు నుంచి డ్రగ్ తీసుకొచ్చిన ఔట్ సోర్సింగ్ ఉద్యోగి అరెస్ట్

విశాలాంధ్ర-విజయవాడ (క్రైం): బెంగుళూరు నుంచి ఎండీఎంఏ డ్రగ్స్‌ను బెజవాడ సరఫరా చేస్తున్న వ్యవహారాన్ని ఈగల్ టీం పోలీసులు బట్టబయలు చేశారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగిని అరెస్టు చేసి, అతని వద్ద నుంచి 15గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. గుణదలకు చెందిన యువకుడు ప్రభుత్వ ఆస్పత్రిలో ఔట్ సోర్సింగ్ కింద ఉద్యోగం చేస్తున్నారు. బెంగుళూరు నుంచి విజయవాడ డ్రగ్స్ సరఫరా చేస్తున్నాడని పక్కా సమాచారంతో ఈగల్ టీం ఆ యువకుడిని కృష్ణలంక వద్ద అదుపులోకి తీసుకుంది. అతని వద్ద నుంచి సుమారు 15గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకుని కృష్ణలంక పోలీసులకు అప్పగించారు. ఈమేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కారు ఢీకొని మహిళ మృతి

మద్యం మత్తులో దూసుకొచ్చిన కారు డ్రైవర్

విశాలాంధ్ర-విజయవాడ (క్రైం): విజయవాడ బందరురోడ్డులో కారు ఢీకొని మహిళ మృతి చెందింది. ఈఘటన విజయవాడ కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సేకరించిన వివరాల ప్రకారం కృష్ణలంకకు చెందిన దుర్గమ్మ(32) భర్తతో కలిసి బందురోడ్డులోని వివంత హోటల్ వద్ద ఆటో దిగుతున్నారు. భర్త ఆటో డ్రైవర్‌కు డబ్బు ఇస్తున్న సమయంలో దుర్గమ్మ ఆటోలోనే కూర్చునే ఉంది. అదే సమయంలో వెనుక నుంచి మద్యం మత్తులో అతివేగంగా వచ్చిన కారు ఎదురుగా ఉన్న బుల్లేట్ బైక్‌ను ఢీకొట్టి, ఆ తర్వాత బరికేట్స్‌ను ఢీకొట్టి కారు అదుపుతప్పి ఆటోను ఢీకొట్టింది. ఆటోలో ఉన్న దుర్గమ్మ రోడ్డు పై పడి తలకు బలమైన గాయం కావడంతో అక్కడిక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని దుర్గమ్మ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కారు డ్రైవర్ షహాభాజ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతను లబ్బీపేటకు చెందిన వారిగా గుర్తించారు. ఈమేరకు కృష్ణలంక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డ్రోన్‌తో ట్రాఫిక్ పర్యవేక్షణ

విశాలాంధ్ర-విజయవాడ (క్రైం): విజయవాడ దసరా ఉత్సవాల్లో సందర్భంగా విజయవాడ ట్రాఫిక్ పోలీసులు డ్రోన్‌తో పర్యవేక్షణ చేస్తున్నారు. ఇంద్రకీలాద్రిపై జరిగే ఉత్సవాలు సోమవారం మూలా నక్షత్రం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకునేందుకు వస్తారు. ఈనేపథ్యంలో ఆదివారం రాత్రి రామవరప్పాడు రింగ్ వద్ద ట్రాఫిక్ సీఐ రమేష్ పర్యవేక్షణలో డ్రోన్‌తో ట్రాఫిక్ పర్యవేక్షణ చేస్తున్నారు. ట్రాఫిక్ సరిదిద్దేందుకు, ఉల్లంఘనదారుల కట్టడికి డ్రోన్ టెక్నాలజీ వినియోగానికి విజయవాడ ట్రాఫిక్ పోలీసులు రంగం సిద్ధం చేశారు. డ్రోన్ సాంకేతికతను ట్రాఫిక్ జామ్‌ల నియంత్రణకు వినియోగిస్తారు. వాటి ద్వారా ట్రాఫిక్ జామ్‌కు కారణం కనుక్కుంటారు. రోడ్డు ప్రమాదం జరిగితే పరిస్థితిని అంచనా వేసి అవసరమైతే క్రేన్‌ను పంపుతారు. రోడ్డు పై అడ్డుగా పడి ఉన్న వాహనాలను తొలగిస్తారు.

అసమానతలపై ఎగిసిపడిన విప్లవ పతాకం

భగత్ సింగ్‌ను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలి

సీపీఐ నగర కార్యదర్శి జి కోటేశ్వరరావు పిలుపు

విశాలాంధ్ర-విజయవాడ: యువజన త్యాగానికి, ధైర్యానికి ప్రతీక షాహిద్ భగత్ సింగ్ అసమానతలపై ఎగిసిపడిన విప్లవ పతాకమని సీపీఐ నగర కార్యదర్శి జి కోటేశ్వరరావు వెల్లడించారు. భగత్ సింగ్ 118 వ జయంతి సందర్భముగా విద్యార్థి,యువజన సమాఖ్య విజయవాడ నగర సమితి ఆధ్వర్యంలో నగరంలోని దాసరి భవన్‌లో ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. సాయికుమార్, ఎఐవైఎఫ్ నగర అధ్యక్షుడు కంచర్ల భార్గవ్ అధ్యక్షతన స్టాప్ డ్రగ్స్, స్టార్ట్ స్పోర్ట్స్ అనే నినాదంతో ఆదివారం జరిగిన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి జి.కోటేశ్వర రావు ముఖ్య అతిథిగా పాల్గొని భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు ఇంక్విలాబ్ జిందాబాద్ అని నినదిస్తూ తెల్లదొరలపై ఆయన చేసిన తిరుగుబాటు యావత్ భారత దేశాన్ని ఆకర్షించిందన్నారు. భారత మాతా దాస్యసుఖాలకు తెంచేందుకు 23 ఏళ్ల వయస్సులో నవ్వుతూ ఉరి కొయ్యలను ముద్దాడి, సామ్రాజ్య,మతోన్మాద వ్యతిరేక పోరాటాలకు భావి తరాలకు దిక్సూచిగా నిలిచిన జ్వలించే నిప్పు కణిక భగత్ సింగ్ అన్నారు. ఆయన అడుగుజాడలలో నేటి యువత మత్తు పదార్థాలకు, చెడు వ్యసనాలకు దూరంగా నడుస్తూ దోపిడి, కులమత రహిత సమసమాజ నిర్మాణంలో యువత కంకణ బద్ధులు అవ్వాలని పిలుపు నిచ్చారు. ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎం. యుగంధర్ మాట్లాడుతూ సంవత్సరానికి కోటి ఉద్యోగాలు కల్పిస్తాం, నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి ఇస్తాం అని ఎన్నిక సమయంలో పాలకులు ఇచ్చిన వాగ్దానాలు ఆచరణ మాత్రం శూన్యమన్నారు. ఈ తరుణంలో యువతకు విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అందక పోయినా నేడు కళాశాల స్థాయి నుంచి పాఠశాల స్థాయి వరకు అలాగే పట్టణ ప్రాంతం నుండి గ్రామీణ ప్రాంతాలకు కూడా మాదక ద్రవ్యాలు అందుబాటులోకి రావడం నేడు పాలకులు సిగ్గు పడాల్సిన అంశం అన్నారు. 140 కోట్ల మంది జనాభాలో అధికముగా యువత ఉన్న భారత దేశం నేటికి అంతర్జాతీయ స్థాయిలో క్రీడలో రాణించలేక పోవడం, ఒలంపిక్స్ వంటి క్రీడల్లో పతకాల పట్టికలో మన స్థానం మాత్రం భూతద్దంలో పెట్టి వెతకాల్సిన పరిస్థితి ఉందన్నారు. యువతను క్రీడలలో పోత్సహించడం ద్వారా వారికి క్రీడలకు మౌలిక సదుపాయాలు కల్పించక పోవడం పాలకుల నిర్లక్ష్యం వల్లే అని ఇప్పటికైనే ప్రభుత్వాలు స్పందించి మాదక ద్రవ్యాలు నిరోధించి యువతను క్రీడలలో ప్రోత్సహించాలని కోరారు. అలాగే అందరికీ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని భగత్ సింగ్ నేషనల్ ఎంప్లాయ్ మెంట్ గ్యారెంటీ యాక్ట్ అమలులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఆయన స్ఫూర్తితో దేశ వ్యాప్త ఉద్యమానికి ఎఐవైఎఫ్ ఇప్పకికే నాంది పలికింది అని భవిష్యత్తులో పాలకుల మెడలు వంచి యువత తమ హక్కులను కాపాడుకొనే బాధ్యత నేటి యువతపై ఉన్నది అని యుగంధర్ పేర్కొన్నారు. నగర సహాయ కార్యదర్శి లంకే సాయి వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యవర్గ సభ్యులు తునం వీరయ్య, ఎస్ కె నజీర్, నగర మహిళా సమాఖ్య నాయకులు, పంచదార్ల దుర్గాంబ, ఓర్సు భారతి, దుర్గాసి రావణమ్మ, యువజన సమాఖ్య నాయకులు మమత, ఎస్. మోహన్ ప్రసాద్, ఐ. ఆంజనేయులు, పంచదార్ల విజయ్, షైనీ, స్వప్న, విద్యార్థి సమాఖ్య నాయకులు కార్తీక్, జగదీష్, రంజిత్, సుధీర్, అభి, ప్రమోద తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ ఫాసిజానికి వ్యతిరేకంగా పోరాడుదాం

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : జ్యోతిబా పూలే సామాజిక స్ఫూర్తితో, షహీద్ భగత్ సింగ్ విప్లవ పోరాట వారసత్వాన్ని మేళవించి, అర్ఎస్ఎస్ మనువాద కార్పొరేట్ ఫాసిజానికి వ్యతిరేకంగా పోరాడుదాం అని న్యూడెమోక్రసీ నాయకులు పిలుపు నిచ్చారు. జ్యోతిబాపూలే సత్య శోధక సమాజ్ 152 ఆవిర్భావ దినోత్సవం-షహీద్ భగత్ సింగ్ 118 వ జయంతిని పురస్కరించుకొని సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ విజయవాడ నగర కమిటీ ఆధ్వర్యంలో మొగల్రాజపురంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో పద్మ మాట్లాడుతూ ఎటువంటి సాంకేతికత అభివృద్ధి లేని అత్యంత వెనకబడ్డ కాలంలో 152 సం. ల క్రితం కుల వివక్షతల వ్యతిరేకంగా సాంఘిక సమానత్వం కోసం జ్యోతిబాపూలే ఎంతో కృషి చేశారన్నారు. అందుకోసమే సత్యాన్ని కనుగొందాం సాంఘిక వివక్షత లేని సమాజాన్ని నిర్మించాలనే లక్ష్యంతో లిసత్య శోదక్ సమాజ్ స్థాపించారని అన్నారు. సమానత్వానికి చదువు ముఖ్య భూమిక పోషిస్తుందని దళితులకు, వెనుకబడ్డ వర్గాలకు, ముఖ్యంగా మహిళలకు చదువును నేర్పించడంలో బ్రాహ్మణీయ భావజాలం నుండి అనేక అవాంతరాలను ఎదుర్కొని ఎందరినో విద్యావంతులుగా తయారు చేశారని ఆమె అన్నారు. తన భార్య అయిన సావిత్రి భాయ్ పూలేకి విద్యను నేర్పించడమే కాకుండా దేశములో తొలి మహిళా ఉపాధ్యాయుని తీర్చిదిద్దారని గుర్తు చేశారు. ఆస్ఫూర్తితోనే బాబా సాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగ రూపశిల్పిగా దళితులకు, వెనుకబడ్డ వర్గాలకు, మహిళలకు, మైనార్టీలకు, వెనుకబడ్డ జాతులకు అనేక హక్కులను కల్పిస్తూ ప్రజాస్వామిక సూత్రాలతో రాజ్యాంగాన్ని దేశానికి అందించారని గుర్తు చేశారు. మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ మోడీ ప్రభుత్వం తిమ్మిని బమ్మి, బమ్మిని తిమ్మి చేస్తూ ప్రజలను మతం పేరుతో మాయ చేస్తుందన్నారు. అన్ని మతాలను సమానంగా చూడాలని, కుల వివక్షతలు అంటరాని తనం ఉండరాదన్న భారతదేశాన్ని హిందుత్వ దేశంగా మార్చేందుకు మైనారిటీ మతాలపై దాదులకు పూనుకుంటుందని, దేశంలోని మతాల మధ్య చిచ్చు పెడుతుందని కుల వివక్షతలను ప్రోత్సహిస్తుందని విమర్శించారు. దేశములో జరిగిన బాంబు దాడుల విధ్వంసాలలో కొన్నింటికి ఆర్ఎస్ఎస్ మూలాలు ఉన్న ప్రజ్ఞ ఠాకూర్ సింగ్ ముఠా చేసిందని రుజువు చేసిన యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ ఆఫీసర్లు చంపబడి, ఆ కేసును కొట్టివేశారన్నారు. ఇదే పద్ధతిలో కేంద్ర హెూం మంత్రి అమిత్ షాపై ఉన్న విలేఖరి ఎన్కౌంటర్ కేసులో విచారణ జరిపిన జడ్జి కూడా ఆకస్మిక మరణానికి గురైన సంగతిని గుర్తు చేశారు. గాంధీజీ మొదలుకొని నేటి బాంబు దాడుల హత్యల వరకు సంబంధం ఉన్న ఆర్ఎస్ఎస్ వందేళ్లు పూర్తి చేసుకుని దేశంపై ఫాసిజాన్ని రుద్దడానికి అర్రులు చాస్తున్న వేళ, అన్ని వర్గాల ప్రజలు మరింత అప్రమత్తతో ఫాసిస్టు వ్యతిరేక పోరాటాలలో ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు.

ప్రాంతీయ ఆహారాలలో పోషకాహార అవగాహన

విశాలాంధ్ర-ఘంటసాల : ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాము, సామాజిక విజ్ఞాన కళాశాల విద్యార్థులు మండల కేంద్రమైన ఘంటసాల జే పీ రైస్ మిల్ ఆవరణలో గ్రామీణ అవగాహన పని అనుభవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానికంగా లభ్యమయ్యే ఆహార పదార్థాల ప్రదర్శనలో ప్రాంతీయ ఆహార పదార్థాల ప్రాముఖ్యతను వివరించారు. స్థానికంగా లభించే ఆహారంతో పోషకాహారం తయారీ విధానంను ప్రదర్శించారు. ప్రతి కుటుంబం స్థానికంగా లభించే ఆహారంతో పోషకాధాన్యాలు, కూరగాయాలు, పంట్లను వాడితే ఆరోగ్యం కాపాడుకోవచ్చన్నారు. పిల్లల్లో రక్తహీనత, పోషకాహార లోపం తగ్గుతుంది. ఈ కార్యక్రమంలో స్టఫ్ పరాఠీ, యాపిల్. బీట్రూట్లో జామ్, పుదీనా రైస్ వంటకాలను తయారు చేసి ప్రదర్శించారు.

muthoot HOUSING FINANCE

ముత్తూట్ హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్

రిజిస్టర్డ్ ఆఫీస్ : టిసి నం.14/2074-7, ముత్తూట్ సెంటర్, పున్నెన్‌రోడ్, తిరువనంతపురం-695 034, సిఐఎన్ నం : యు65922కెఎల్2010పిఎల్‌సి025624 కార్పొరేట్ ఆఫీస్ : 12/ఎ 01, 13వ అంతస్తు, పరిణీ క్రిసెంజో, ప్లాట్ నం.సి38 & సి39, బంద్రా కుర్లా కాంప్లెక్స్-జి బ్లాక్ (ఈస్ట్), ముంబై-400051, టెలి నం : 022-62728517, Email Id: authorised.officer@muthoot.com

అనుబంధం-4 [(నిబంధన 8(1)] స్వాధీనత ప్రకటన (స్థిర ఆస్తి కొరకు)

సెక్యూరిటైజేషన్ అండ్ రికన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 (54 ఆఫ్ 2002) మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు- 2002 యొక్క నిబంధన 3 తో చదివే సెక్షన్ 13(12) కింద సంక్రమించిన అధికారాలను వినియోగించి **ముత్తూట్ హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్** యొక్క అధీకృతఅధికారిగా దిగువ సంతకందారు, ఈ కింద ప్రస్తావించిన రుణగ్రహీత(లు) / హామీదారు(లు) లకు డిమాండ్ నోటీసు జారీచేయడమైనది. డిమాండ్ నోటీసు అందుకున్న తేదీ నుంచి 60 రోజుల గడువు పూర్తయిన తర్వాత కూడా రుణగ్రహీత(లు) / హామీదారు(లు) బాకీ మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమైనందున పేర్కొన్న నిబంధనల యొక్క నిబంధన 8 తో చదివే చట్టం లోని సెక్షన్ 13 (4) కింద సంక్రమించిన అధికారాలను వినియోగించి, కింద వివరించిన ఆస్తిని దిగువ సంతకందారు **లాంఛనప్రాయంగా స్వాధీనపరుచుకున్నట్లు** రుణగ్రహీత(లు) / హామీదారు(లు) మరియు సాధారణ ప్రజానీకానికి నోటీసు ఇవ్వడమైనది.

వ. నం.	ఎల్‌పిఎన్/రుణగ్రహీత/ సహ-రుణగ్రహీత/ హామీదారు పేరు	డిమాండ్ నోటీసు తేదీ	బకాయి పడిన మొత్తం (రూ.లలో) భవిష్యత్తు వడ్డీ వర్తించును	స్వాధీనత తేదీ
1.	లోన్‌ఎక్కౌంట్‌నెం.MHFLREFVIJ000005007887 **1.బవిరిశెట్టి నాగేశ్వరరావు, 2.బవిరిశెట్టి వెంకట శివ నాగ దుర్గ 3.భవిరిశెట్టి మధు, 2.పోపూరి గోపి**	04-జూన్ 2025	03-జూన్-2025 నాటికి **రూ.22,59,671.41/-**	**25-సెప్టెంబరు -2025**

హామీగా పెట్టిన ఆస్తి(లు)/స్థిర ఆస్తి(లు) వివరాలు: అంధ్రప్రదేశ్, కృష్ణాజిల్లా, కంచికచర్ల ఎస్‌ఆర్‌ఓ, చందర్లపాడు మండలం, చింతలపాడు గ్రామం మరియు గ్రామ పంచాయతీ, ఆర్.ఎస్.నం. 464. డి.నం.2-43 వద్ద సేల్‌డీడ్ నం: 2857/2021లో మొత్తం 2071.06 ఎస్‌ఎఫ్‌టి నిర్మిత ప్రదేశంతో గ్రౌండ్ ఫ్లోర్, మొదటి అంతస్తు కలిగిన ఆర్‌సిసి పైకప్పు నివాసిత భవనం తోపాటు 158 చదరపు గజాల విస్తీర్ణపు భూమితో కూడిన ఆస్తి యావత్తు. హద్దులు: ఐటెమ్ నం.1: 'సి' షెడ్యూల్ - బి నాగేశ్వరరావు-సేల్‌డీడ్ 2857/2021లో 79 చదరపు గజాల విస్తీర్ణంతో. తూర్పు: శ్రీ రామనేని పార్థసారథి ఆస్తి, పడమర: రోడ్డు, ఉత్తరం: బవిరిశెట్టి మధు ఆస్తి, దక్షిణం: శ్రీ రామనేని కోదండపాణి ఆస్తి. ఐటెమ్ నం:1 : 'డి' షెడ్యూల్-బి మధు- సేల్‌డీడ్ 2857/2021లో 79 చదరపు గజాల విస్తీర్ణంతో. తూర్పు: శ్రీ రామనేని పార్థసారథి ఆస్తి, పడమర: రోడ్డు, ఉత్తరం: ఆవుల చలపతిరావు ఆస్తి, దక్షిణం: బవిరిశెట్టి నాగేశ్వరరావు ఆస్తి.

ఈ ఆస్తితో ఎటువంటి లావాదేవీలు నెరపరాదని మరియు ఆస్తితో ఎటువంటి లావాదేవీలైనా పైన వివరించినట్లుగా డిమాండ్ చేసిన మొత్తం మరియు దానిపై భవిష్యత్తు వడ్డీకి గాను **ముత్తూట్ హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్** చార్జికి లోబడి ఉండునని ఇందుమూలంగా ప్రత్యేకించి రుణగ్రహీత/లు/హామీదారు/లు మరియు సాధారణ ప్రజలను హెచ్చరించడమైనది.

ప్రదేశం: అంధ్రప్రదేశ్, తేదీ: **29 సెప్టెంబరు, 2025** — **సం/- అధీకృత అధికారి, ముత్తూట్ హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ తరఫున**

రైతులకు నష్టపరిహారం ఇవ్వాలి

సీపీఐ డిమాండ్

విశాలాంధ్ర-తిరువూరు : మండలంలోని రెండు నెలలుగా కురిసిన భారీ వర్షాలకు పంటలు దెబ్బతిన్న రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని సురవరం, రోలపడి, ముష్టికుంట్ల, రాజు గూడెం, ఎర్రమడు గ్రామాల్లో ఆదివారం సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యవర్గ సభ్యులు చిలుకూరి వెంకటేశ్వ రరావు, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి షేక్ నాగుల్ మీరా నీట మునిగిన పంటపొలాలను పరిశీలించారు. ఈ పర్యటన లో వారు మాట్లాడుతూ రైతుల కోసం సీపీఐ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని అన్నారు. ఇప్పటికీ రెండు నెలల నుంచి కురిసిన భారీ వర్షాలకు పత్తి, మిరప మొదలకు పంటల్లో నీరు నిలబడి, మొక్కలు కుచించుకుపోయి ఆకులు పసుపు రంగులో వచ్చినాయని, పత్తి కాయలు చేతికొచ్చిన పంట వర్షాలకు నల్లబడి పత్తి పనికి రాకుండా పోయిందని, కోతకు వచ్చిన పంటలు పురుగుబడి కాయల కుళ్ళిపోయి చెట్లు మండలుగా మారాయని, ప్రభుత్వం వెంటనే వారిని ఆదుకోవాలని కోరారు. రైతులు వేలాది రూపాయల పెట్టు బడి పెట్టి చేతికందే ఈ సమయానికి వర్షాలు విపరీతం గా వచ్చి రెండు నెలల పాటు రైతులను ముంచిందని. మిరప చేనులు వర్షపు నీరు నిల్వ ఉండి మిరప పంటలు కూడా చేతికందేటట్టు లేవని, ఇదేవిధంగా ఇంకా కొన్ని రోజులు ఇలాగే వర్షాలు పడితే వరి పంట కూడా రైతులకు చేతికి రాదని ఆందోళన చెందుతున్నారని అన్నారు. లక్షల్లో పెట్టుబడి పెట్టి తీరా రైతు చేతికందే సమయానికి అతివృష్టితో వర్షాలకు దెబ్బతిన్న రైతు, కౌలు రైతులను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని, నష్టపోయిన పత్తి. మిరప, వరి, వగైరా పంటల రైతుకు నియోజకవర్గంలోని అన్ని గ్రామాలలో వర్షానికి దెబ్బతిన్న పంట పొలాలను అధికారులతో అంచనా వేసి నష్టపరిహారం అందించాలని, రైతులకు పంటల బీమా సౌకర్యం కల్పించాలని సబ్సిడీతో కూడిన విత్తనాలు ఎరువులు పురుగుమందులు మొదలగు సౌకర్యాలు కల్పించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ పర్యటనలో రైతులు తెలకపల్లి గోపాలరావు, దానం రాజా,కొండా సాయిబాబా, పగిటిమళ్లి రవి తదితర పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంతో వ్యవసాయం

విశాలాంధ్ర-పెదపారుపూడి : సాంకేతిక పరిజ్ఞానంతో వ్యవసాయం ముందుకు సాగుతోందని పిఏసిఎస్ సొసైటీ మాజీ అధ్యక్షుడు పునుకొల్లు ప్రసాద్, పాలడుగు అమరబాబులు ఆదివారం అన్నారు. మండల కేంద్రమైన పెదపారుపూడి గ్రామంలో సుమారు 60 ఎకరాలలో వరి నాట్లు వేసి ఆ పొలంలో చీడా, పీడా వరికి హాని చేసే పురుగుల నివారణకు పురుగుమందులు పిచికారి చేసే నిమిత్తం డ్రోన్ లను ఉపయోగించి తక్కువ సమయంలో ఎక్కువ పొలం పిచికారి చేసినట్లు అమర్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా అమర్ బాబు మాట్లాడుతూ డ్రోన్ ల సహాయం లేకుండా అదే పొలంలో పవర్ స్ప్రేర్ లతో పిచికారి చేయాల్సి వస్తే 6 రోజులు పడుతుందని, అదే డ్రోన్ సహాయంతో ఒకరోజు లో పూర్తవుతుందని అన్నారు. ఒక ఎకరాకు వచ్చి పవర్ స్ప్రేర్ లతో పిచికారి చేసిన రూ.350 అవుతుందని, డ్రోన్ లతో పిచికారి చేసిన రూ.350 అవుతుందని అయితే విష పురుగులు పొలంలో సంచరించే అవకాశం ఉన్నందున రైతుకు కానీ, కౌలు రైతుకు గాని నష్టం వాటిల్లకుండా డ్రోన్ సాయంతో పిచికారితో ఇబ్బందులు ఉండవని అన్నారు.

జగన్‌ను సైకో అంటే తప్పేంటి !?

ఉన్నమాట అంటే ఉలుకెందుకో వైసీపీ నేతలు చెప్పాలి

విశాలాంధ్ర బ్యూరో మచిలీపట్నం : నగరంలోని ఈశ్వర్ రెసిడెన్సీలో జరిగిన విలేకరుల సమావేశంలో మచిలీపట్నం బాలకృష్ణ ఫ్యాన్స్ మెట్టు సూరిబాబు, విశ్వనాథపల్లి విజయ్ లు మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ సైకో పోవాలి, సైకిల్ రావాలి అనే నినాదంతోనే ప్రజలు జగన్ ని గద్దె దించారన్న విషయాన్ని వైసీపీ నాయకులు అప్పుడే మర్చిపోయారా...... అంటూ విమర్శించారు. సైకో అంటే ఎవరో మీకు తెలియకున్న రాష్ట్ర ప్రజలందరికీ తెలుసని అన్నారు. వాలయ్య బాబుపై వ్యక్తిగత విమర్శలను సహించేది లేదని, వైసీపీ నేతలు నోరు అదుపులో ఉంచుకుని, జాగ్రత్త గా మాట్లాడాలని, తెలుగు సినీ పరిశ్రమకు బాలయ్య బాబు ఒక మహావృక్షం లాంటి వారని, హిందూపూర్ లో హ్యాట్రిక్ కొట్టిన ప్రజానాయకులు బాలయ్యబాబు అని ఎవరికి ఏ సమస్య వచ్చినా ముందుగా గుర్తుకు వచ్చేది మా బాలయ్య బాబు మాత్రమే అని అన్నారు. హైదరాబాద్‌లోని బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి ద్వారా లక్షలాది మంది పేదలకు ఉచిత వైద్య సేవలు అందిస్తున్న వ్యక్తి బాలయ్య అని, సైకో అన్న పదం బూతు పదం కాదన్న విషయాన్ని గ్రహించాలన్నారు. మీ సైకో నాయకుడు తన సొంత సొమ్ముతో ఎప్పుడైనా ఎవరికైనా సహాయం చేశాడా....అని ప్రశ్నించారు. గత అసెంబ్లీలో మీ వైసీపీ నాయకులు ఏవిధంగా బూతులు మాట్లాడారో మరచిపోయారా ....? మీరు ఆనాడు అసెంబ్లీ లో మాట్లాడిన భాషతో పోలిస్తే మా బాలయ్యబాబు మాట్లాడిన మాటలు ఏవి పార్లమెంటు నియమాలు లేదా విధానాలకు విరుద్ధమైన పదాలు కాదన్న విషయాన్ని వైసీపీ నాయకులు గ్రహించాలన్నారు. ఈ సమావేశంలో బాలకృష్ణ అభిమానులు గణపతి, వెంకన్న, శ్రీనివాస్, యుగందర్, బుజ్జిబాబు, గంగ, సత్యం తదితరులు పాల్గొని మాట్లాడారు.

7వ రోజు అమ్మవారి అలంకారాలు

విశాలాంధ్ర-గుడివాడ : విజయదశమిని పురస్కరించు కుని దేవి శరన్నవరాత్ర మహోత్సవాల 7వ రోజు ఆదివారం అమ్మవారి దేవాలయాలు భక్తులతో కళకళలాడుతున్నాయి.

శ్రీభీమేశ్వరస్వామి వారి దేవస్థానంలో...

స్థానిక బంటుమిల్లి రోడ్‌లో వేంచేసియున్న శ్రీ భీమేశ్వరస్వామివారి దేవస్థానములో జరుగుతున్న శ్రీ దేవి శరన్నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారు శ్రీరాజరాజేశ్వరిదేవి అవతారంలో దర్శనమి చ్చారు. ఉత్సవ కమిటీ చైర్మన్ పట్టపు చిన్న, కమిటీ సభ్యులు, కార్యనిర్వాహణాధికారి గోపాలరావుల నేతృత్వంలో అమ్మవార్కి ప్రత్యేకపూజలు నిర్వహించారు.

శ్రీగౌరీశంకరస్వామి వారి దేవస్థానంలో...

స్థానిక గౌరీశంకరపురంలోని శ్రీ గౌరీశంకర స్వామి వారి దేవస్థానంలో శ్రీ దేవి శరన్నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా ఆదివారం మహాగౌరిదేవిగా భక్తులకు దర్శినమిచ్చారు. దేవా లయంలో మహా చండీహోమ కార్యక్రమాల్లో దేవస్థానము కమిటి చైర్మన్ నెరుసు బోసు, ఇఓ కందుల వెణుగోపాలరావు, పట్టణ ప్రముఖులు, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

శ్రీవేణుగోపాలస్వామి వారి దేవస్థానములో...

గుడివాడలోని శ్రీ వేణుగోపాలస్వామి వారి దేవస్థానంలో శ్రీ దేవి శరన్నవరాత్ర మహోత్సవలల్లో భాగంగా శ్రీమీనాక్షి దేవి అలంకరణలో దర్శనమిచ్చారు. అమ్మ వార్కి విశేషపూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిటి చైర్మన్ అంగడాల సతీష్, కమిటి సభ్యులు, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కెవి గోపాలరావు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవెంకటేశ్వరస్వామి వారి దేవస్థానములో...

గుడివాడలో వేంచేసియున్న శ్రీ వెంకటేశ్వరస్వామివారి దేవస్థానములో శ్రీ దేవి శరన్నవరాత్ర మహోత్సవలల్లో భాగంగా గజలక్ష్మీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. అమ్మ వార్కి విశేషపూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో కమిటి సభ్యులు లింగం చిట్టిబాబు ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కెవి గోపాలరావు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయాలి : తహశీల్దార్

విశాలాంధ్ర-కంచికచర్ల : ఎగువ ప్రాజెక్టుల నుండి భారీగా వరదనీరు వస్తున్నందున, పులిచింతల ప్రాజెక్టు నుండి ప్రకాశం బ్యారేజీకి వరద నీరు విడుదలవుతోంది. సుమారు 7 నుంచి 8 లక్షల క్యూసెక్కుల వరద నీరు ప్రకాశం బ్యారేజీకి చేరుకుంటుందని భావిస్తు న్నారు. నందిగామ డివిజన్ కంచికచర్ల మండల పరిధిలోని కృష్ణా నది ప్రవాహ సంబంధిత అధికారులకీ, కృష్ణా నది పరిసర గ్రామాల ప్రజలకు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ నరసింహారావు సూచిం చారు. అవసరమైన ప్రాంతాలలో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయాలి అని అధికారులను ఆదేశించారు. అవాంఛనీయ ఘటనలు లేకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సంబంధిత గ్రామ రెవెన్యూ, ఇతర శాఖల అధికారులను తహశీల్దార్ ఆదేశించారు.

శ్రీ మహాచండిదేవి సమక్షంలో చండీ హోమం

విశాలాంధ్ర-కూచి పూడి : దసరా శరన్నవ రాత్రి మహోత్సవాల వేడుకలో భాగంగా ఏడవ రోజైన ఆదివారం బాలా త్రిపుర సుందరి అమ్మ వారు శ్రీమహా చండీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. దసరా వేడుకల సందర్భంగా ప్రతినిత్యం నిర్వహించే చండీ హోమం కు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి తిలకించి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ చండి హోమాన్ని రెనోవాహాస్పిటల్స్ (హైదరాబాద్) కార్డియాలజిస్ట్. విభాగాధిపతి (చైర్మన్)డాక్టర్ భాగవతుల కుటుంబ శ్రీనివాస శాస్త్రి-డాక్టర్ ఉమా(హైదరాబాద్ దంపతులు యాగంలో పాల్గొన్నారు.

మొవ్వ మండలానికి 8,431 ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ మండ లంలోని 16 సచివాలయాల్లో అక్టోబర్ 1వ తేదీన పంపిణీ చేసే ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు రూ.8431కు 3,62,86,500 కేటాయించి నట్లు ఎంపీడీవో దయాలుసుహాసిని తెలిపారు. దీనికి సంబంధించిన పెన్షన్ మొత్తాన్ని సోమ వారం సచివాలయాల వారిగా ఆయా బ్యాంకుల్లో జమ పడుతుందని రాజేష్ ఆ మొత్తాన్ని పంపిణీ సిబ్బందిఅందజేస్తారని వివరించారు. 30వ తేదీన దుర్గాష్టమి సందర్భంగా సెలవు దినం కావడంతో ఒక రోజు ముందుగానేసిబ్బంది తీసుకొని అక్టోబర్ 1వ తారీఖున లబ్ధిదా రులకు అందజేస్తారని తెలిపారు.

మహాచండీ అమ్మవారికి పూజలు

విశాలాంధ్ర-విస్సన్నపేట : దేవీ శరన్న వరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం పలుచోట్ల కనకదుర్గ అమ్మవారిని మహా చండీ దేవిగా అలంకరించి, భక్తులు పూజిం చారు. స్థానిక కనకదుర్గ దేవాలయం, పుట్రేల మారెమ్మ దేవాలయం, విస్సన్నపేట చంద్రేశేఖరస్వామి దేవాలయాల్లో పెద్దఎత్తున పూజలు నిర్వహించారు. పుట్రేల మారెమ్మ దేవాలయంలో దేవాదాయశాఖ అధికారులు తిరువూరుకు చెందిన కళాకారులతో నాట్య ప్రదర్శన ఏర్పాటు చేశారు.

నేడు 'మీకోసం' : కలెక్టర్ బాలాజీ

విశాలాంధ్ర బ్యూరో మచిలీపట్నం : ఈ నెల 29వ తేదీ సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించి వివిధ ప్రాంతాల ప్రజల నుండి అర్జీలు స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డీకే. బాలాజీ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలకు పరిపాలన మరింత చేరువ చేయడానికి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మండల, మున్సిపల్ స్థాయిలకు ప్రభుత్వం వికేంద్రీకరించినట్లు తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని డివిజన్, మండల కార్యాలయాల్లో, మున్సిపల్ కార్యాలయాల్లో కూడా మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని ఆయన వివరించారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలో మండల లేదా మున్సిపల్ కార్యాలయాల్లో అందచేయాల న్నారు. మీకోసం కాల్ సెంటర్1100 నెంబరుకు కాల్ చేసి అర్జీ నమోదు, అర్జీ స్థితిని తెలుసుకోవచ్చన్నారు.

తెలుగు భాషకు వన్నె తెచ్చిన మహాకవి గుర్రం జాషువా: డొక్కా

విశాలాంధ్ర - గుంటూరు వైద్యం : తెలుగు భాషకు మహాకవి జాషువా తన కవిత్వంతో వన్నె తెచ్చారని మాజీమంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ కొనియాడారు. జాషువా కళా పీఠం ఆధ్వర్యంలో పలువురు జాషువా 130వ జయంతి సందర్భంగా ఆదివారం నగరంపాలెంలోని జాషువా విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ జాషువా ఉమ్మడి గుంటూరు జిల్లాలోని పల్నాడు ప్రాంతంలో జన్మించి గుంటూరు నగరంలో జీవించి అద్భుతమైన కవిత్వం సృజించారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో పల్నాడు లేదా గుంటూరు జిల్లాకు జాషువా జిల్లాగా నామకరణం చేయాలని ఆయన కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన జిల్లాల పునర్విభజన మంత్రుల ఉప సంఘానికి నివేదించామని సానుకూల స్పందన వస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో జాషువా కళా పీఠం సభ్యులు గద్దం ఎలీషా, కడియం జేమ్స్, పాలకాయల వెంకట్, దర్శనపు శ్రీనివాస్, జయ ప్రకాష్, బిజెపి గుంటూరు జిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరుపతి రావు, అత్తోట జోసఫ్, చావలి బాలస్వామి, డాక్టర్ మూకిరి సుధ, హోర్నోస్ట్ సలీంబాబు, సముద్రాల చిన కోటేశ్వరావులు పాల్గొన్నారు.

మహాప్రస్థాన అభివృద్ధికి రూ.3 లక్షలు అందజేత

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : స్థానిక బొంగ రాలబీడు మహాప్రస్థానం అభివృద్ధి కోసం ఏలూరి సుబ్బారాయుడు ధర్మ పత్ని చెన్నమ్మ జ్ఞాపకార్థం వారి కుటుంబసభ్యులు ఏలూరి వెంకటేశ్వర్లరావు-తిరుపతమ్మ, వెంకట రావు-సామ్రాజ్యంలు రూ. 3 లక్షలు చెక్కును మహాప్రస్థానం కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు వారికి ధన్యవాదాలు తెలియ జేశారు. వీరిని ఆదర్శంగా తీసుకుని ప్రతిఒక్కరూ మహాప్రస్థానం అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెలగపూడి లక్ష్మణరావు, యార్లగడ్డ అంకమ్మ చౌదరి, కమిటీ సభ్యులు కల్లూరి రమణయ్య, ఏలూరి నరసింహారావు, కూనల మాలకొండయ్య, నిమ్మగడ్డ అంకమ్మ చౌదరి, జంగాలపల్లి పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

అణచివేతకు వ్యతిరేకంగా కలం పట్టిన

విప్లవ కవి జాషువా: సీపీఐ

విశాలాంధ్ర- మంగళగిరి : నవ యుగ కవి చక్రవర్తి, సామాజిక విప్లవ కవి, కవికోకిల, కళాప్రపూర్ణ, కవితా విశారద, తెలుగు కవితా లోకానికి మార్గదర్శి అయిన కవి దిగ్గజ గుర్రం జాషువా 130వ జయంతి సభ ఆదివారం ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యమండలి ఆధ్వర్యంలో సీపీఐ కార్యాలయంలోని వేములపల్లి శ్రీకృష్ణ భవన్‌లో ప్రజానాట్యమండలి జిల్లా నాయకులు కంచర్ల కాశయ్య అధ్యక్షతన జరిగింది. ముందుగా ఆయన చిత్రపటానికి రేఖా కృష్ణార్జున రావు, ప్రజానాట్యమండలి, సీపీఐ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో సామాజిక సమానత్వం, కులవివక్ష నిర్మూలన, మానవతా విలువల కోసం పోరాడిన జాషువా సేవలను గుర్తుచేసుకున్నారు. గుర్రం జాషువా తన రచనల ద్వారా కుల వివక్ష, సామాజిక అసమానతలకు వ్యతిరేకంగా సమానత్వానికి గొప్ప సందేశం అందించిన వ్యక్తి అని తెలిపారు. ఆయన 'గబ్బిలం', 'ఫిరదౌసీ', 'క్రీస్తు చరిత్ర' వంటి ప్రసిద్ధ రచనల ద్వారా సమాజంలో మార్పుకు దోహదపరిచిన సాహిత్యకారుడు అని గుర్తుచేశారు. బ్రాహ్మణవాదం, సామాజిక పక్షపాతానికి వ్యతిరేకంగా సజీవ పోరాటం చేసి, సమసమాజ స్థాపన కోసం తన జీవితాన్ని అంకితం చేసారని అన్నారు. సమాజంలోని అన్యాయాన్ని, వివక్షను చెరిపివేసే దిశగా ఆయన తన రచనలు, నాటకాలు, కవితల ద్వారా ప్రజలను మేల్కొల్పి, సమాజంలోని వర్గవాదంపై తీవ్ర విమర్శలు చేసి గొప్ప సంఘసంస్కర్తగా పేరు సంపాదించారని చెప్పారు. ఈ సందర్భంగా పలు గేయాలను కంచర్ల కాశయ్య, అల్లక తాతారావు, కె.ప్రభాకర్ ఆలపించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, మండల కార్యదర్శి జాలాది జాన్ బాబు, కవి గోలి మధు, అల్లక తాతారావు, ఎస్సీ, ఎస్టీ రైట్స్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కారుమంచి రామారావు, ప్రముఖ న్యాయవాది గుజ్జర్లపూడి జాన్ బాబు, బీసీ నాయకులు కుర్ర శ్రీనివాసరావు, కుక్క మాల ప్రభాకర్, పొట్లబత్తిని లక్ష్మణరావు, గోవిందు, న్యాయవాది శిఖ సురేష్, చిన్ని సత్యనారాయణ, జె.శంకరరావు, పంతగాని మరియదాసు, తుడుమెళ్ళ వెంకటయ్య, ఆకురాతి శ్రీనివాసరావు, ఉడత శ్రీనివాసరావు, ఎస్‌కే భాష, కోడూరి శివాజీ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కస్తూరి తిలకం పద్య నాటకం

విశాలాంధ్ర-తెనాలి : తెనాలి రామకృష్ణ కళాక్షేత్రంలో జరుగుతున్న వీణ అవార్డ్స్ జాతీయ స్థాయి నాటక పోటీలు రెండవ రోజు కూడా కోలాహలంగా జరిగాయి. ఉదయం చందాల కేశవ దాసు కళాపరిషత్ మధిర వారి కస్తూరి తిలకం పద్య నాటకాన్ని ప్రదర్శించారు. ఈ నాటకాన్ని ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా తిలకించారు. మధ్యాహ్నం నుండి రాత్రి వరకు బ్రహ్మరథం, యాగం, భువి కోరని భ్రమణం, పుత్రాదిచ్చేద్, అయోధ్య రామయ్య, ఇది ప్రమాదానికి సంకేతం నాటిక ప్రదర్శనలు జరిగాయి.

మధుమేహ వ్యాధిపై అవగాహన

విశాలాంధ్ర-తెనాలి : ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తెనాలి శాఖ ఆధ్వర్యంలో ఆదివారం మధుమేహ వ్యాధిపై అవగాహన కార్యక్రమం జరిగింది. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోగినేని ఉమ, ఐఎంఏ ప్రెసిడెంట్ అనిల్‌కుమార్, సెక్రటరీ ప్రభాకర్, డాక్టర్ చందు సాంబశివుడు తదితరులు పాల్గొని మాట్లాడుతూ మధుమేహ వ్యాధి ఎందుకు వస్తుంది, తీసుకోవలసిన జాగ్రత్తలను గురించి వివరించారు. మెడికల్ ప్రాక్టీషనర్లకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. సీఎంఈ కార్యక్రమం తొలిసారిగా తెనాలిలో నిర్వహించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

కదంబ వనవాసినీదేవి అలంకారంలో అమ్మవారు

విశాలాంధ్ర-పెదకాకాని : మల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో దసరా ఉత్సవాలలో భాగంగా ఆదివారం భ్రమరాంబదేవి అమ్మవారు కదంబ వనవాసినీ దేవి అలంకారంలో భక్తులు దర్శించుకున్నారు. దసరా ఉత్సవాలు ఆలయ స్థానాచార్యులు పొత్తూరి సాంబశివరావు పర్యవేక్షణలో ఉదయం సుప్రభాతసేవ, హారతులు, విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనములు, పంచగవ్యప్రాశన, మహన్యాసపూర్వక ఏకాథ రుద్రాభిషేకములు, నవావరణార్చనలు, సాయంత్రం భ్రమరాంబదేవి అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చనలు, పంచహారతులు, ఆలయ ప్రదక్షణ, తీర్థప్రసాదములు వినియోగము జరిగినట్లు ఆలయ ఉపకమిషనరు గోగినేని లీలాకుమార్ తెలిపారు. యాగశాలలో భక్తులు రుద్ర, చండీ హోమాలు జరిపించుకున్నారు.

చిట్టిబాబుకు నివాళి

విశాలాంధ్ర-దుగ్గిరాల: తహసిల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న పులివర్తి చిట్టిబాబు(51) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. గత కొన్ని సంవత్సరాలుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. చిట్టిబాబు మృతితో రెవెన్యూ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు భౌతికకాయాన్ని సందర్శించి, నివాళులు తెలిపి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

కోలాహలంగా ప్రమాణస్వీకారాలు

విశాలాంధ్ర-పెదనందిపాడు : మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షునిగా కోడూరి రఘురామారావు (రాంబాబు) మండల మహిళా విభాగం అధ్యక్షురాలుగా ఈశ్వరమ్మ, అబ్బినేనిగుంట పాలెం సొసైటీ అధ్యక్షురాలుగా సయింపు పార్వతి, డైరెక్టర్లుగా డేవిడ్ రాజు, షేక్ సాంబయ్యల ప్రమాణస్వీకారం ఆదివారం కోలాహలంగా నిర్వహించారు. తొలుత అబ్బినేనిగుంటపాలెంలో సొసైటీ అధ్యక్షురాలు, డైరెక్టర్లతో ప్రమాణస్వీకారం చేయించిన ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు భారీ ట్రాక్టర్ల ర్యాలీతో పాలెం నుంచి నాగులపాడు ఉప వ్యవసాయ మార్కెట్ యార్డ్ వరకు వచ్చి యార్డులో మండల అధ్యక్షుడు రాంబాబు, మహిళా అధ్యక్షురాలు చెన్నం ఈశ్వరమ్మలతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు మాకినేని పెదరత్తయ్య, జంపని రామారావు, గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు రావి శివరామకృష్ణయ్య, ఎన్ఆర్ఐ టీడీపీ నాయకుడు ఆళ్ల వెంకటసుబ్బారావు, ఐటీడీపీ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాషువా జయంతి

విశాలాంధ్ర-తాడేపల్లి : సమాజ సంస్కరణకు సాహిత్యాన్ని ఆయుధంగా ఎంచుకుని అసమానతలపై గళమెత్తిన నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా అని గుఱ్ఱం జాషువా సేవా సమితి అధ్యక్షులు దర్శనపు శామ్యూల్ అన్నారు. ఆదివారం గుఱ్ఱం జాషువా జయంతి సందర్భంగా స్థానిక జాషువా సేవా సమితి కార్యాలయంలో గుఱ్ఱం జాషువా చిత్రపటానికి పలువురు నేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా దర్శనపు శామ్యూల్ మాట్లాడుతూ కుల వ్యవస్థకు వ్యతిరేకంగా జాషువా పోరాడారన్నారు. తన సాహిత్యంతో సమాజంలో ఎన్నో మార్పులు తీసుకొచ్చారన్నారు. సేవా సమితి కార్యదర్శి తుడిమెళ్ల వెంకటయ్య, డైరెక్టర్ పెరికే బాబు మాట్లాడుతూ జాషువా తన జీవితాంతం కులవివక్ష, అంటరానితనం, మూఢ విశ్వాసాలకు వ్యతిరేకంగా, మహిళల అభ్యున్నతి కోసం కృషి చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీరాములు, శ్రీను, శ్రీనివాస్ రెడ్డి, కోటేశ్వరరావు, రాంబాబు, వెంకట్ రెడ్డి, సోడాబండి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గుండె జబ్బులే.. మరణాలకు ప్రథమ కారణం

కార్డియాలజిస్ట్ డాక్టర్ రాఘవ శర్మ

విశాలాంధ్ర- గుంటూరు వైద్యం : ప్రపంచ వ్యాప్తంగా మరణాలకు గుండె జబ్బులే ప్రథమ కారణమని, ముందుగానే నివారణ చర్యలు తీసుకోవడం ద్వారా లక్షలాది ప్రాణాలను రక్షించవచ్చని లలితా హాస్పిటల్స్ అధినేత, ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ రాఘవ శర్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 29న వరల్డ్ హార్ట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 'వరల్డ్ హార్ట్ డే' జరుపుకుంటారని, ప్రతి సంవత్సరం ఒక నినాదం ఇస్తారని, 'డోంట్ మిస్ ఎ బీట్', ప్రతి గుండె చప్పుడు విలువైనదే అనేది ఈ సంవత్సర నినాదమన్నారు. గుండె సంబంధిత వ్యాధుల వల్ల (కార్డియో వ్యాస్కులర్ డిసీస్) అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత దశాబ్దంలోనే కార్డియో వాస్కులర్ డిసీజ్ వలన మరణాలు దాదాపు రెండింతలయ్యాయని, ప్రపంచ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం 2.05 కోట్లకు పైగా మరణాలు గుండె సంబంధిత వ్యాధుల వలన సంభవిస్తున్నాయన్నారు. వీటిలో 80 శాతం వరకు మరణాలను ముందస్తు పరీక్షలు, సకాలంలో వైద్యం, ఆరోగ్యకరమైన జీవనశైలి పాటించడం ద్వారా నివారించవచ్చన్నారు. భారతదేశంలో పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉందని, నమోదవుతున్న మొత్తం మరణాల్లో 27శాతం గుండె సంబంధిత వ్యాధుల వల్లే జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తాజాగా వెలువడిన గణాంకాల ప్రకారం ప్రతి 1 లక్ష జనాభాకి 272 మంది గుండె వ్యాధులతో మరణిస్తున్నారని, ప్రతి ఒక్కరూ గుండె జబ్బుల హెచ్చరిక సంకేతాలను గుర్తించి క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. రోజూ వ్యాయామం, ఆరోగ్యకరమైన ఆహారం అలవర్చుకోవాలని చెప్పారు.

నివారణ చర్యలు..

ప్రతి ఒక్కరూ రక్తపోటు, షుగరు, కొలెస్ట్రాల్‌ను కాలానుగుణంగా సంవత్సరానికి ఒకసారి పరీక్షించుకోవాలని, ప్రతిరోజు కనీసం 30 నిమిషాలు మితమైన వ్యాయామం చేయాలని, పండ్లు, కూరగాయలు, ధాన్యాలు అధికంగా ఉండే, ఉప్పు, ట్రాన్స్-ఫ్యాట్స్, ప్రాసెస్ చేసిన ఆహారం తక్కువగా ఉండే ఆహారం తీసుకోవాలన్నారు. అదేవిధంగా ధూమపానం మానుకోవాలని, ఒత్తిడిని నియంత్రించాలని, ఛాతినొప్పి, ఆయాసం, గుండె వేగంగా కొట్టుకోవడం వంటి హెచ్చరిక సంకేతాలను గుర్తించి వెంటనే వైద్య సహాయం పొందటం వలన గుండె జబ్బులను నివారించవచ్చన్నారు.

గుర్రం జాషువా జయంతి వేడుకలు

విశాలాంధ్ర-తెనాలి : నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా 130వ జయంతి సందర్భంగా బీజేపీ రాష్ట్రవ్యాప్తంగా అనేక కేంద్రాలలో జయంతి వేడుకలు నిర్వహించారు. భాజపా ఆధ్వర్యంలో తెనాలి బస్టాండ్ వద్ద ఉన్న గుర్రం జాషువ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆ పార్టీ అధికార ప్రతినిధి డాక్టర్ తమిరిశ అనంతాచార్యులు పాల్గొన్నారు.

డిజిటల్ బుక్ ఆవిష్కరణ

విశాలాంధ్ర - వినుకొండ : స్థానిక వైసీపీ కార్యాలయంలో డిజిటల్ బుక్ ఆవిష్కరించారు. ఆ పార్టీ పీఏసి మెంబర్, వినుకొండ మాజీ శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలు పడే కష్టాలను, బాధలను ఈ డిజిటల్ బుక్‌లో పొందుపరచవచ్చు అన్నారు. కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలను పక్కనపెట్టి రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేస్తుందన్నారు. వైసీపీశ్రేణుల కుటుంబ సభ్యులను, కూటమి నాయకులు, అధికారులు పెట్టే ఇబ్బందులను ఈ డిజిటల్ బుక్‌లో పందుపరిస్తే జగనన్న అధికారంలోకి వచ్చిన తర్వాత వారిని న్యాయపరంగా శిక్షించే విధంగా చర్యలు తీసుకోవటానికి ఎంతగానో దోహదపడుతుందని బొల్లా అన్నారు. కూటమి నాయకుల అన్యాయాలకు, అక్రమాలకు గురైన వైసీపీ ప్రతి ఒక్క కార్యకర్త ఆవేదన ఈ డిజిటల్ బుక్ ద్వారా జగన్మోహన్ రెడ్డికి చేరుతుందని, ఇది జగనన్న మనకు ఇచ్చిన ఒక రక్ష అన్నారు.

ముంపులో మత్స్యకార కాలనీ

విశాలాంధ్ర-దాచేపల్లి : కృష్ణానదిలో నీటి ఉధృ తికి రామాపురంలోని మత్స్యకారుల కాలనీ శని వారం రాత్రి ముంపునకు గురైంది. కృష్ణానది, మూసీ నదుల సంగమంలో నెలకొన్న వరద తాకిడి ప్రభావం తీర గ్రామాలను ముంచెత్తింది. దీనిలో భాగంగానే కాలనీ ముంపునకు గురికావడంతో స్థానికులు ఆందోళనకు లోనయ్యారు. అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. అప్పటికప్పుడు ఆ కాలనీని సందర్శించి పరిశీలించారు. ఇళ్ళను ఖాళీ చేయించి బాధిత కుటుంబ సభ్యులను హుటాహుటిన సురక్షిత ప్రాంతమైన ఉన్నత పాఠశాలకు తరలించారు. నీట మునిగిన పంట పొలాలను పరిశీలించారు. అందరికీ భోజన సౌకర్యాలు కల్పించారు. వైద్య శిబిరం కూడా ఏర్పాటు చేశారు. గురజాల ఆర్డీఓ మురళీకృష్ణ, దాచేపల్లి తహశీల్దార్ గోగసాని శ్రీనివాస యాదవ్ శిబిరాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. కాలనీలో నివశిస్తున్న బాధిత కుటుంబాలకు ఇంటి స్థలాలు ఇస్తామని భరోసా ఇచ్చారు.

గుర్రం జాషువా జయంతి వేడుకలు

విశాలాంధ్ర - వినుకొండ : స్థానిక వైసీపీ కార్యాలయంలో ఆదివారం పద్మ భూషణ్, కళా ప్రపూర్ణ, కవికోకిల, కవితా విశారద, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత, నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా జయంతి సందర్భంగా వారి చిత్ర పటానికి ఆ పార్టీ పీఏసి మెంబర్, వినుకొండ మాజీ శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు పూల మాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

నేడు నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం

విశాలాంధ్ర-దాచేపల్లి : నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం ఈ నెల 29న జరుగుతుందని కమిషనర్ వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఒకటో సచివాలయంలో జరిగే ఈ సమావేశానికి సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు విధిగా హాజరుకావాలని ఆయన కోరారు.

గుర్రం జాషువాకు ఘననివాళి

విశాలాంధ్ర-మాచర్ల : పల్నాడు జిల్లాకు మహాకవి గుర్రం జాషువా పేరును నామకరణం చేయాలని పలువురు ప్రజా సంఘాల నాయకులు ఆదివారం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహాకవి జాషువా 130వ జయంతిని పురస్కరించుకొని జాషువా విగ్రహానికి పూలమాలతో నివాళులర్పించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డీబీఎఫ్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు కుక్కమూడి ప్రసాద్ మాట్లాడుతూ ఆధునిక తెలుగు కవులలో పేరు ప్రఖ్యాతులుగాంచిన తెలుగు సుప్రసిద్ధత కవి నవయుగ కవి చక్రవర్తి పద్మభూషణ్ మహాకవి గుర్రం జాషువా అన్నారు. తెలుగుజాతి కీర్తి ప్రతిష్టలను దేశానికి చాటిచెప్పిన కవి గుర్రం జాషువా సమాజంలోని అసమానతలను, అంటరానితనాన్ని నిర్మూలించడానికి కవిత్వాన్ని ఆయుధంగా చేసుకొని సమాజాన్ని మేల్కొల్పిన మహనీయుడు గుర్రం జాషువా అన్నారు. కార్యక్రమంలో పేరుపోగు జార్జి, గురజాల అప్పారావు, కొరదల జ్యోతి, పరిమళ రాజారావు, బొడ్డుపల్లి, ఈశ్వరయ్య, ఇరువంటి శ్రీనివాసులు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు సర్పంచ్‌లకు శిక్షణా తరగతులు

విశాలాంధ్ర-దాచేపల్లి : గ్రామీణ ప్రాంతాల అభివృద్దే లక్ష్యంగా ప్రజా ప్రతినిధులకు సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. సర్పంచులు, కార్యదర్శులు, జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు విధిగా హాజరుకావాలని ఎంపీడీఓ ఉల్లంగుల వెంకటేశ్వరరావు కోరారు.

నవ సమాజ స్థాపనే.. జాషువాకు అసలైన నివాళి: జీవీ



విశాలాంధ్ర - వినుకొండ : నవ సమాజ స్థాపనే కవికోకిల గుర్రం జాషువాకు అసలైన నివాళి అని చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. యావత్ రాష్ట్రం, దేశం గర్వించే ఆయన వినుకొండ ప్రాంతానికి చెందిన వారు కావడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. కవిగా, సామాజిక ఉద్యమకారుడిగా, ఎమ్మెల్సీగా, పద్మభూషణ్ అవార్డు గ్రహీతగా ఈ ప్రాంతానికి ఆయన అనితర సాధ్యమైన గుర్తింపును తీసుకు వచ్చారంటూ ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు. గుర్రం జాషువా 130 జయంతి సందర్భంగా ఆదివారం మున్సిపల్ ఆఫీసు జాషువా కళా ప్రాంగణంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ కవితల ద్వారా సమాజంలో గొప్ప మార్పు కోసం పునాది వేసిన అభ్యుదయవాది గుర్రం జాషువా, నమ్మిన బాటలో నిర్విరామంగా కృషి చేశారని కొనియాడారు. సమాజంలోని అసమానతలపై పోరాడిన జాషువా బాటలోనే యువత ఆయన ఆశయ సాధన కోసం యువత నడుం బిగించాలని పిలుపునిచ్చారు. అందరు కలసికట్టుగా కృషి చేస్తే ఆయన ఆశయాలు సాధించి తీరుతామన్నారు. గుర్రం జాషువా గుర్తుగా స్థానిక ఎన్సెస్పీ మైదానంలో ఆధునిక డిజిటల్ లైబ్రరీ ఏర్పాటు చేస్తామని, ఒక పెద్ద అంబేద్కర్ భవన్ కూడా నిర్మిస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జున రావు, కౌన్సిలర్లు, నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

విశాలాంధ్ర-దుర్గి : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇరువురు మృతి చెందిన సంఘటన దుర్గిలో ఆదివారం జరిగింది. మండల పరిధిలోని కంచరగుంట గ్రామానికి చెందిన రాయపాటి ఆనంద్(14) ద్విచక్ర వాహనంపై దుర్గికి వచ్చి తిరిగి వెళ్తుండగా ఏటీఎం దగ్గర ముందుగా వెళ్లుతున్న ట్రాక్టర్‌ను తప్పించబోయి ట్రాక్టర్ కింద పడటంతో అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. మేడికొండూరు మండలం సిరిపురం గ్రామానికి చెందిన కొమరిగిరి ఆదినారాయణ(36) కుటుంబ సభ్యులతో ఆత్మకూరు పోలేపల్లి అచ్చయ్య నర్సరీలో పనికి వచ్చారు. ఆదివారం ఆదినారాయణ నర్సరీ నుంచి కూరగాయలు నిమిత్తం టీవీఎస్ వాహనంపై దుర్గికి వస్తుండగా దుర్గి వైపు నుంచి మాచర్ల వైపు వెళ్లుతున్న మరో ద్విచక్ర వాహనం దుర్గి మిర్చియార్డు ప్రధాన రహదారిపై వేగంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆదినారాయణ అక్కడికక్కడే మృతిచెందాడు. ఢీకొట్టిన ద్విచక్ర వాహనదారున్ని అంబులెన్స్‌లో మాచర్లకు తరలించారు. ఈ రెండు సంఘటన వద్దకు ఎస్సై సుధీర్ కుమార్ సిబ్బందితో చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టమ్ నిమిత్తం మాచర్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతి సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర-పెదకూరపాడు : పులిచింతల డ్యామ్‌కు వరద నీరు పెరుగుతున్న నేపథ్యంలో లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ సూచించారు. నాగార్జున సాగర్ నుంచి దిగువనున్న పులిచింతల ప్రాజెక్టుకు వరద నీరు చేరే అవకాశం ఉందని తెలిపారు. ఎగువ నుంచి వస్తున్న వరద నీటిని పులిచింతల నుంచి దిగువకు పంపుతున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తమై దిగువ లోతట్టు ప్రాంత ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని అన్నారు. స్థానిక నాయకులను సమన్వయం చేసుకుంటూ అధికారులు సహాయ చర్యలు చేపట్టాలని సూచించారు. ఎలాంటి నష్టం వాటిల్లకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని, అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు ప్రజలకు అండగా ఉండాలని తెలిపారు.

భగత్ సింగ్ స్ఫూర్తితో మత్తు పదార్థాలపై ఉద్యమిస్తాం: ఏఐవైఎఫ్

విశాలాంధ్ర - వినుకొండ : ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో విప్లవ వీరుడు, స్వతంత్ర సమరయోధుడు, నేటి యువతకు మార్గదర్శి, స్ఫూర్తిదాయకుడు సర్దార్ భగత్ సింగ్ 118వ జయంతిని ఆదివారం సీపీఐ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ నియోజకవర్గ కార్యదర్శి దారి వేముల మరియ బాబు మాట్లాడుతూ స్వాతంత్ర ఉద్యమ ధృవతార భగత్ సింగ్ స్ఫూర్తితో నవ భారత నిర్మాణంలో యువత పాత్ర ఎంతో కీలకమైందని అటువంటి యువత నేడు మాదక ద్రవ్యాలకు బానిసలై యువ శక్తి నిర్వీర్యం అవ్వడం దేశ ప్రగతికి విఘాతం కలుగుతుందని అన్నారు. స్టాప్ డ్రగ్స్ - స్టార్ట్ స్పోర్ట్స్ అనే నినాదంతో దేశ వ్యాప్తంగా మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఈ తరుణంలోనే భగత్ సింగ్ 118వ జయంతిని పురస్కరించుకొని మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా సెప్టెంబరు 28 నుంచి అక్టోబర్ 4 వరకు రాష్ట్ర వ్యాప్తంగా యువజన చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. భగత్ సింగ్ నేషనల్ ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ యాక్ట్ అమలు పరచాలని దేశవ్యాప్తంగా ఏఐవైఎఫ్ డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. సర్దార్ భగత్ సింగ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ధ్యేయంగా ఏఐవైఎఫ్ కృషి చేస్తున్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో సి.హెచ్ రవి, షేక్ సుభాని, ఎస్.కె. మస్తాన్, మంద మోషే, మంద చిన్న స్వామి, భాస్కర్ రెడ్డి, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

నీటమునిగిన పంట పొలాలు

విశాలాంధ్ర-దాచేపల్లి : కృష్ణానదిలో వరద నీటి ప్రవాహంతో కాట్రపాడులోని పంట పొలాలు నీట మునిగాయి. 150 ఎకరాలకు పైగా పత్తి, వరి తదితర పంటలు నీట మునగడంతో నష్టం వాటిల్లినట్లు బాధిత రైతులు చెప్పారు. ఒకాట్రపాడును కూడా పులిచింతల ముంపు గ్రామంగా ప్రకటించాలని కోరారు. అదే కోవలో నష్టపరిహారాన్ని ఇవ్వాలని విన్నవించారు.

పల్నాడు జిల్లాకు గుర్రం జాషువా పేరు పెట్టాలి

విశాలాంధ్ర-చిలకలూరిపేట: పల్నాడు జిల్లాలో జన్మించిన మహాకవి గుర్రం జాషువా జిల్లాకు ఆయన పేరు పెట్టాలని శ్రీకృష్ణ యాదవ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు ఎక్సైజ్ సీఐ గోరంట్ల నారాయణ యాదవ్ కోరారు. జాషువా 130వ జయంతి సందర్భంగా అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని రిజిస్టర్ ఆఫీస్ ఎదురుగా ఉన్న ఆయన విగ్రహానికి పూల మాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంప్రదాయ పద్ధతిలో తన కవితా పాటవాన్ని తెలుగు ప్రజలకు వివిధ సాహిత్య ప్రక్రియల్లో రుచి చూపించిన ఈ కవి విశారదుడని, ఏ తెలుగు కవి భారత సాహిత్య రంగంలో సాధించలేనన్ని విశిష్ట స్థానాలను, అవార్డులను, పదవులను గుఱ్ఱం జాషువా పొందారని గుర్తు చేశారు. అంటరానితనం, నిరుద్యోగం, ఆకలి,దారిద్ర్యం, దేవాలయ ప్రవేశ నిషేధం లాంటి వివక్షలను కళ్లకు కట్టినట్లు తన భావచిత్రాలతో, విశేషణాలతో అద్భుతంగా వ్యక్తీకరించారని వివరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు గోలి భాను ప్రకాష్ యాదవ్, కార్యదర్శి నర్ర నాగరాజుయాదవ్, కొమ్మనబోయిన రాంబాబు యాదవ్, పోటు శ్రీనివాసరావు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

జ్ఞానేశ్వరి అర్బన్ అండ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో...

జ్ఞానేశ్వరి అర్బన్ అండ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ (గార్డ్స్) ఆధ్వర్యంలో పట్టణంలోని శాఖ గ్రంథాలయంలో ఆదివారం మహాకవి జాషువ జయంతి కార్యక్రమం నిర్వహించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ దేవుళ్లను కథా వస్తువుగా తీసుకుని కవులు కావ్యాలు రాస్తుంటే, జాషువ ఒక దళితుడిని కథా వస్తువుగా తీసుకుని గబ్బిలం, అనాథ వంటి కావ్యాలు రాసారన్నారు. పేదల, దళితుల ఆవేదనలు, ఆక్రందనలు తన రచనల్లో దర్శనమిస్తాయన్నారు. తొలుత గ్రంథాలయం ఎదురుగా ఉన్న మహాకవి జాషువ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేసారు. ఈ కార్యక్రమంలో గార్డ్స్ అధ్యక్షురాలు దాసరి ధనలక్ష్మీ, గార్డ్స్ సలహాదారులు, మాజీ ఏపిపి దాసరి చిట్టిబాబు, రిటైర్డ్ డి.ఈ.ఓ. కనుమూరి జాషువ, జాషువ సిద్ధాంతభూమిక ఉపాధ్యక్షులు మద్దుల వేంకట కోటయ్య, సాహితీ విమర్శకులు డా.పీవీ సుబ్బారావు, బి.అజయ్ బాబు, గోరంట్ల నారాయణ, దార్ల బుజ్జిబాబు, గుంజి వీరాంజనేయులు, జెట్రిపోతుల బుల్లిబాబు, గ్రంథలయ ఇంచార్జ్ అధికారి డి.వీరాజు, సరోజినీ తదితరులున్నారు.

అసెంబ్లీలో కూటమి తీరు అహంకారపూరితం: బొల్లా

విశాలాంధ్ర - వినుకొండ : డబుల్ ఇంజన్ సర్కార్ సభ్యులు బాలకృష్ణ, కామినేని శ్రీనివాసరావు అసెంబ్లీలో మాట్లాడిన తీరు అహంకార పూరితంగా ఉన్నాయని మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. ఆదివారం వైసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని వాడు వీడు అని సంబోధించడం, సినీ నటులు చిరంజీవిని కూడా అపహాస్యం చేసి మాట్లాడటం సిగ్గుచేటు అన్నారు. ఆనాడు చిరంజీవి సినీ పరిశ్రమ పెద్దలు, జగన్మోహన్ రెడ్డి ఇంటికి వెళ్లినప్పుడు ఎంతో మర్యాదపూర్వకంగా, గౌరవం ఇచ్చారని బ్రహ్మనాయుడు గుర్తు చేశారు. అలాగే అసెంబ్లీలో హోం శాఖ మంత్రి అనిత నోటి నుండి దమ్ము ఉందా, ధైర్యం ఉందా అనే పదాలు రావడం విచారకరమన్నారు. ఇక వినుకొండ శాసనసభ్యులు, చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు వినుకొండలో మాట్లాడిన తరహాలోనే అసెంబ్లీలో కూడా మాట్లాడటం అవివేకమన్నారు. ఇక జీవీ స్వగ్రామమైన ఈపూరు మండలం ఇనుమళ్ళ గ్రామంలో ఇది ప్రభుత్వ భూమి అంటూ రెవెన్యూ అధికారులు బోర్డు పెట్టినప్పటికీ, దీన్ని దిక్కరించి ఎమ్మెల్యే అండతో కొందరు భూములు స్వాధీనం చేసుకున్నారని బ్రహ్మనాయుడు ఆరోపించారు. అలాగే వినుకొండ మండలం జాలలపాలెం గ్రామంలో 50 ఏళ్ల క్రితం సర్వేనెంబర్ 68. 1,2 లో 50 కుటుంబాలు 1967లో ప్రభుత్వ పట్టాలు పొంది ఇల్లు నిర్మించుకొని నివాసముంటున్నారని, అయితే ఇప్పుడు ఆ స్థలం ప్రభుత్వ భూమి అంటూ ఇల్లు ఖాళీ చేయాలని, ఒకరి అవసరం కోసం ప్రభుత్వం ఎస్సీ కుటుంబాలపై ఒత్తిడి చేస్తున్నదని, దినిపై పెద్ద ఎత్తున తాము ఆందోళన చేపడతామని బ్రహ్మనాయుడు హెచ్చరించారు. అయితే గత ఎన్నికలకు ఆ ఎస్సీ కుటుంబాల వారు వైసీపీకి ఓటు వేశారన్న కక్షతో ఈ దారుణానికి తెగబడుతున్నారన్నారు. ఇక రెవెన్యూ, వ్యవసాయ శాఖ, రైతు భరోసా కేంద్రాలలో, అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో వైసిపి వర్గానికి చెందిన ప్రజలు, రైతులు వెళితే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని బొల్లా ఆరోపించారు. ఇక అన్ని సొసైటీ కేంద్రాలలో ఎరువులు బ్లాక్ మార్కెట్‌కు తరలి వెళ్లిపోతున్నాయని, అలాగే ఫలానా కంపెనీకి చెందిన ఎరువు గుళికలు విక్రయిస్తేనే యూరియా ఇవ్వండి మిగతా ఎరువులు అమ్మండి అంటూ ఎరువులు డీలర్లపై, వ్యవసాయ శాఖ అధికారులపై కొందరు ఒత్తిడి తెస్తున్నారని బ్రహ్మనాయుడు ఆరోపించారు. జగన్మోహన్ రెడ్డి హయాంలో 17 మెడికల్ కాలేజీలు వస్తే, 14 ఏళ్ల చంద్రబాబు పాలనలో ఎన్ని మెడికల్ కాలేజీలు వచ్చాయో కూటమి ప్రజబుద్ధులు తెలపాలన్నారు. గుర్రం జాషువా జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు మాట్లాడుతూ గుర్రం జాషువా పేదరిక నిర్మూలనకు తమ కవితల ద్వారా ఎంతో చైతన్యపరచారన్నారు. కుల పీడనకు వ్యతిరేకంగా ఎన్నో పోరాటలు చేస్తూ ప్రజల్ని చైతన్య పరచడంతో పాటు, దేశవ్యాప్తంగా ఎంతో గుర్తింపు పొందారు అన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు అమ్మిరెడ్డి అంజిరెడ్డి, పగడాల వెంకటరామిరెడ్డి, అధికార ప్రతినిధి సీనియర్ న్యాయవాది ఎం.ఎన్. ప్రసాద్, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాల్లో మంత్రి నాదెండ్ల పర్యటన

విశాలాంధ్ర-తెనాలి : కొల్లిపర మండలంలోని కృష్ణ నది పరివాహక వరద ముంపు ప్రాంతాలలో మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదివారం పర్యటించారు. బొమ్మువానిపాలెంలో వరద పరిస్థితిని అధికారులతో కలసి పరిశీలించిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ ప్రకాశం బ్యారేజ్ నుండి భారీగా నీటిని దిగువకు విడుదల చేస్తున్నారని, సాయంత్రానికి 7 లక్షల క్యూసెక్కుల నీరు విడుదలయ్యే అవకాశం ఉందని, 8 లక్షలు దాటితే పంటలకు నష్టం కలిగే ప్రమాదం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందించాలి: ఎస్పీ

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : సుదీర్ఘ అనుభవాన్ని, తెలివితేటలను ఉపయోగించి ప్రజలకు మెరుగైన సేవలు అందించటంలో ప్రత్యేక చొరవ చూపాలని గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ సూచించారు. హెడ్ కానిస్టేబుళ్ల నుంచి ఏఎస్సైలుగా ఉద్యోగోన్నతి పొందిన ఆరుగురు ఆదివారం జిల్లా పోలీస్ కార్యక్రమంలో ఎస్పీ వకుల్ జిందాల్‌ను గౌరవ పూర్వకంగా కలిసి జ్ఞాపికను అందించి, కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ ఉద్యోగోన్నతి పొందిన ఏఎస్సైలను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉద్యోగోన్నతి పొందటం అనేది ప్రతి ఉద్యోగికి ఒక గౌరవం అని, ఆ గౌరవాన్ని కాపాడుకుంటూ శాంతిభద్రతల పరిరక్షణలో తనదైన రీతిలో విధులు నిర్వహించి జిల్లా పోలీస్ విభాగానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

వీరాంజనేయ స్వామిని దర్శించుకున్న నాయుడు

విశాలాంధ్ర-పొన్నూరు : అఖిల భారత చిరంజీవి ఫ్యాన్స్ అధ్యక్షులు రవణం స్వామి నాయుడు అమ్మవారి దీక్షలో భాగంగా పొన్నూరులో వేంచేసి ఉన్న దశావతారం విష్ణు టెంపుల్, సహస్ర లింగేశ్వర స్వామి గుడి, వీరాంజనేయ స్వామి వార్లను దర్శించుకున్నారు. స్వామి నాయుడుకి ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు గావించారు. అనంతరం స్వామినాయుడికి స్వామి వారి తీర్థప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా చిరంజీవి యువత మేకల రవీంద్రబాబు, పత్రా నాంచారయ్య, విష్ణు మొలకల చంద్రమోహన్, విన్నకోట సురేష్, మాదాసు అప్పారావు, అనిల్ కుమార్, జనసేన నాయకులు షేక్ కరీముల్లా, వల్లంశెట్టి శ్రీధర్, సూదా వసంత్, ఎరసాని నాగభూషణం, పత్తి సురేష్, పత్తి శ్రీకాంత్, వేముల నారాయణ, ఎలవర్తి ఫణి, ఇమ్మడి శ్రీనివాసరావు, అనిల్, చిరంజీవి ఫ్యాన్స్, జనసేన కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

విప్లవ వీరుడు భగత్ సింగ్ జయంతి

ప్రజానాట్యమండలి

విశాలాంధ్ర-పొన్నూరు : దేశ స్వాతంత్రానికి తన ప్రాణాన్ని తృణప్రాయంగా అర్పించిన విప్లవ వీరుడు సర్దార్ భగత్ సింగ్ అని ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి గుంటూరు జిల్లా కార్యదర్శి ఆరేటి రామారావు అన్నారు. ఆదివారం గుంటూరు జిల్లా పొన్నూరు పట్టణంలోని సీపీఐ కార్యాలయం వద్ద భగత్ సింగ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మొదట భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సమావేశానికి పులిపాటి రాజు అధ్యక్షత వహించగా ఆరేటి మాట్లాడుతూ భగత్ సింగ్ 12 ఏళ్లకే భరత జాతి విముక్తి కోసం కంకణం కట్టి 14 ఏళ్లకే భారత స్వాతంత్ర సంగ్రామంలో అడుగులేసాడు. 23 ఏళ్లకే ప్రాణత్యాగం చేసి యువతలో జ్వాలను రగిలించిన విప్లవ యోధుడు భగత్ సింగ్ అని 12 ఏళ్ళ వయసులోనే జలియన్వాలాబాగ్ దారుణాలను చూసి భగత్ సింగ్ ఎగిరిపోయాడని బ్రిటీష్ పాలకులపై కసి పెంచుకొని 14 ఏళ్ల ప్రాయంలోనే మహాత్మా గాంధీ పిలుపుతో సహాయ నిరాకరణ ఉద్యమంలో పాల్గొన్నాడని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో షేక్ నజీమ్ బాబు, సాజిత్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాషువా జయంతి

విశాలాంధ్ర-గురజాల : పట్టణంలోని స్థానిక వీఎంఎస్ క్లబ్ ఆవరణలో ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ మిత్ర మండలి సభ్యుడు బంకా జయనాన్ అధ్వర్యంలో జాషువా జయంతి ఘనంగా నిర్వహించారు. జయనాన్ మాట్లాడుతూ నవయుగ కవి చక్రవర్తి కవికోకిల గుర్రం జాషువా 130వ జయంతి వేడుకలు జరుపుకోవటం చాలా సంతోషకరంగా ఉందని, జాషువా కళాపీఠంకి ప్రభుత్వం స్థలం కేటాయించి భవన నిర్మాణానికి తగిన అనుమతులు ఇవ్వడం ఎంతో హర్షించదగ్గ విషయమని అన్నారు. పల్నాడు జిల్లాకు జాషువా పేరు పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వానికి తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. అనంతరం జాషువా పేరుతో కళాకారులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గనిపల్లి శ్యాం, కుక్కమూడి అన్నారావు, జాన్ ప్రకాశ్, కందుకూరి ప్రసాద్, కలకండ ప్రకాశ్, దేగల సబ్బరావు, కొత్తపల్లి శ్రీనివాసరావు, కనకం శ్రీను, బందెల శ్యాం పాల్గొన్నారు.

జడ వాగు బ్రిడ్జి ఏర్పాటు చేయాలి: సీపీఐ

విశాలాంధ్ర-పెదకూరపాడు : అచ్చంపేట మండల పరిధి నుంచి కృష్ణా జిల్లా వెళ్లాలంటే తండవాసులు పల్నాడు జిల్లా నుంచి వచ్చే ప్రయాణికులు వరదలు కారణంగా వాగులు పొంగి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఈ నేపథ్యంలో జడ వాగు వద్ద బ్రిడ్జి ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసినట్లు మాదిపాడు సీపీఐ కార్యదర్శి సుభాని తెలిపారు. ఆదివారం వాగులో దిగి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం సుభాని మాట్లాడుతూ ప్రభుత్వాలు మారిన తండవాసుల బతుకులు మారలేదని అన్నారు. అచ్చంపేట నుంచి కృష్ణా జిల్లా వెళ్లాలంటే ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. వరదలతో వంతెనలు శిధిలావస్థకు చేరాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రభుత్వం చర్యలు చేపట్టి బ్రిడ్జి ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్కే లాల్ సత్యం తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా నదిపై పడవలు తిప్పవద్దు

విశాలాంధ్ర-అమరావతి : నాగార్జునసాగర్ నుంచి వరద ఉధృతంగా రావడంతో పులిచింతల ప్రాజెక్టు స్థాయికి మించిన వరద నీరు నిలవ ఉండటంతో ఐదు లక్షల క్యూసెక్కు నీరు దిగువ ప్రాంతంలో ఉన్న కృష్ణానది ద్వారా వదలడంతో మునుగోడు దిడుగు ముత్తయ్యపాలెం, అమరావతి, పెద్దమద్దూరు దిగువ లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యే పరిస్థితి ఉందని అమరావతి ఎస్సై రాజశేఖర్ తెలిపారు. నీటి ప్రవాహాన్ని, ప్రమాదాన్ని ప్రజలు గుర్తుతెరిగి అప్రమత్తంగా ఉండాలని కోరారు. అలాగే ప్రజలు కృష్ణానదిలో దిగరాదని హెచ్చరించారు. కృష్ణా నదిపై పడవలు తిప్పరాదని అన్నారు.

మనం గడిపే ప్రతి క్షణం విలువైనదే

కోనేరు హంపి

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : చెస్ ఆటలో మనం గడిపే ప్రతి క్షణం విలువైనదేనని ఇండియన్ చెస్ గ్రాండ్ మాస్టర్, పద్మశ్రీ అవార్డు గ్రహీత కోనేరు హంపి అన్నారు. ఆలిండియా చెస్ ఫెడరేషన్ విభాగంలోని ఆంధ్ర చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సహకారంతో గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో 62వ నేషనల్ చెస్ ఛాంపియన్‌షిప్ పోటీలు కొనసాగుతున్నాయి. ఎనిమిదో రోజు కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన కోనేరు హంపితో విజ్ఞాన్స్ వర్సిటీ వైస్ చాన్స్‌లర్ కల్నల్, ప్రొఫెసర్ పి.నాగభూషణ్ ముందుగా ఒక ఎత్తు వేసి ఆటను ప్రారంభించారు. కోనేరు హంపి మాట్లాడుతూ చెస్ క్రీడాకారులందరికీ ఈ ప్రతిష్టాత్మక టోర్నమెంట్ ఒక గొప్ప వేదికని తెలియజేశారు. దేశం నలుమూలల నుంచి వచ్చే క్రీడాకారులతో ఆడే అవకాశం ద్వారా, అనుభవాన్ని పెంపొందించుకునే అవకాశం లభిస్తుందన్నారు. అయితే, ఆటలో కొన్నిసార్లు ఆటంకాలు, విఫలాలు ఎదురైనా వాటిని అధిగమించే ధైర్యం చాలా ముఖ్యమన్నారు. పాజిటివ్‌గా ఆలోచిస్తూ, ఎప్పటికీ ఆత్మవిశ్వాసాన్ని కోల్పోకుండా ముందుకు సాగాలన్నారు. నిరంతర అభ్యాసం, పట్టుదలతో ముందుకు సాగినప్పుడే విజయాలు మన సొంతమవుతాయన్నారు. ప్రతిఒక్కరూ ఎప్పుడూ నేర్చుకోవడమే లక్ష్యంగా పెట్టుకోవాలన్నారు. ఆటలోని ప్రతి అనుభవాన్ని పాఠంగా తీసుకొని ముందుకు సాగితేనే నిజమైన క్రీడాకారుడిగా ఎదగవచ్చునని అభిప్రాయపడ్డారు. ఆలిండియా చెస్ ఫెడరేషన్ హెడ్ ఆఫ్ ఆపరేషన్స్ వికే వర్మ మాట్లాడుతూ చెస్ అనేది ఆలోచన, ఓర్పు, దృష్టి, మేధస్సుల కలయికని అన్నారు. అనుభవం, క్రమశిక్షణ, పట్టుదల, పాజిటివ్ థింకింగ్... ఇవన్నీ కలిసినప్పుడే ఆటగాడు నిజమైన విజయాన్ని సాధించగలడని చెప్పారు. ప్రొఫెసర్ పి.నాగభూషణ్ మాట్లాడుతూ చెస్ బోర్డులో ఒక గేమ్ గెలవడానికి మనం మన ప్రణాళికను అమలు చేయడంతో పాటు, ప్రత్యర్థి ప్రణాళికను కూడా ముందుగానే అంచనా వేసి ఎదుర్కోవాలని అన్నారు. చెస్ ఆట అనేది మన మానసిక సామర్థ్యాన్ని విస్తరింపజేసే గొప్ప శాస్త్రమని అన్నారు. 62వ జాతీయ చెస్ చాంపియన్‌షిప్‌లో ఏడో రౌండ్ ముగిసే సరికి, తొలి ఆరు బోర్డులలో నిర్ణయాత్మక ఫలితాలు రాకపోవడంతో ఆధిక్యంలో మార్పు లేకుండా నిలిచింది. ఇప్పటివరకు 6 పాయింట్లు సాధించిన పీఎస్‌పీబీకి చెందిన గ్రాండ్‌మాస్టర్స్ సశికిరణ్, అభిజీత్ గుప్తా, రైల్వేస్ ఐఎం అరోన్యక్ ఘోష్, ఐఎం ఎలెక్స్ అజయ్ సంతోష్ పర్వతరెడ్డి లీడ్‌ను కొనసాగించారు. వీరితో పాటు విజయాలు సాధించిన పీఎస్‌పీబీకి చెందిన జీఎం దీప్ సెంగుప్తా, రైల్వేస్ ఐఎం అయుష్ శర్మ, తమిళనాడుకు చెందిన ఐఎం హర్ష్ సురేష్ కూడా 6 పాయింట్ల క్లబ్‌లో చేరారు.

సమసమాజ స్థాపనకు జాషువా కృషి

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : వైసీపీ అధ్యాపక విభాగం రాష్ట్ర అధ్యక్షులు మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో కవి కోకిల గుర్రం జాషువా 130వ జయంతి సందర్భంగా ఉపాధ్యాయ అధ్యాపక బృందం జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ జాషువా జీవితంలో ఇద్దరు గురువులు ఉన్నారని, ఒకరు పేదరికం కాగా మరొకరు కులమత బేధమని అన్నారు. పేదరికం ఆయనకు సహనం నేర్పించగా కులమత బేధం ఆయనకి పోరాడేతత్వాన్ని నేర్పించిందని అన్నారు. తన రచనల ద్వారా సమసమాజ స్థాపన కోసం కృషి చేశారని అన్నారు. పెన్షనర్స్ సంఘం జిల్లా అధ్యక్షులు వై.సత్యనారాయణ మాట్లాడుతూ తాను విశ్వనరుడునని తనకు తానుగా ప్రకటించుకున్న మహనీయుడు జాషువా అని కొనియాడారు. ఆంధ్రా క్రైస్తవ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్, క్రిస్టియన్ మైనారిటీ సెల్ అధికార ప్రతినిధి డాక్టర్ పోలే ముత్యం మాట్లాడుతూ రాజు మరణిస్తే అతని పేరు రాళ్ళ మీద చెక్కబడుతుందని, కానీ కవి మరణిస్తే అతని పేరు జనుల మస్తిష్కంలో లిఖించబడుతుందని అన్నారు.

నిరుద్యోగం, పేదరికంపై పోరుకు సిద్ధం కావాలి: ఏఐవైఎఫ్

విశాలాంధ్ర-చిలకలూరిపేట: భగత్‌సింగ్ స్ఫూర్తితో నిరుద్యోగం, పేదరికంపై పోరుకు యువత సంసిద్ధం కావాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి షేక్ సుభాని పిలుపునిచ్చారు. స్వాతంత్ర సమరయోధుడు ఆయన జయంతి సందర్భంగా ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏఐవైఎఫ్ నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా షేక్ సుభాని మాట్లాడుతూ కుల మతాలకతీతంగా, దేశ సమైక్యత సమగ్రత కోసం, స్వేచ్ఛ స్వాతంత్రం, సమైక్యతా సమగ్రత సమానత్వం కోసం ప్రాణ త్యాగం చేసి సాధించిన స్వాతంత్ర ఫలాలు... సంపన్న వర్గాల చేతుల్లో కేంద్రీకృతమయ్యాయన్నారు. 11 సంవత్సరాల మోడీ పాలనలో నల్లధనం వెలికితీత, ఉద్యోగాలు, జన్‌ధన్ యోజన, ధరల స్థిరీకరణ, పన్నుల తగ్గింపు, రైతుల ఆదాయం రెట్టింపు, విద్యా రంగ పరిరక్షణ, మహిళా సాధికారత, సమగ్రాభివృద్ధి వంటి ఎన్నికల వాగ్దానాలు అమలు చేయడంలో ఘోరంగా విఫలమయ్యారన్నారు. శ్రమజీవుల రక్త మాంసాలతో నిర్మితమైన ప్రభుత్వ రంగ సంస్థలను, సహజ సంపదను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టి ఉన్నవాడికి లేనివాడికి అంతరాన్ని పెంచి పేదరికం దారిద్రం, నిరుద్యోగాన్ని పెంచి పోషిస్తుందన్నారు. ప్రజలు ప్రజా సమస్యలు పూర్తిగా పక్కకు నెట్టేందుకు కులం మతం ప్రాంతం భాష పేరుతో తినే తిండిపోయిన కట్టుకునే బట్ట పైన ఆంక్షలు విధించి ప్రజల మధ్య వైషమ్యాలు రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తోందన్నారు. రాజ్యాంగబద్ధమైన స్వతంత్ర సంస్థలను సంఘ పరివార్ చెప్పు చేతుల్లో పెట్టుకుని బిజెపి ఇతర రాష్ట్రాలపై రాజకీయ కక్ష సాధింపులకు పాల్పడుతూ ఫెడరల్ స్ఫూర్తిని కాల రాస్తుం దన్నారు. పాలక ప్రభుత్వాలు అనుసరించే విధానా లపై యువత ఉద్యమించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఏరియా సహాయ కార్యదర్శి బొంతా ధనరాజ్,పట్టణ కార్యదర్శి చెరుకుపల్లి నిర్మల, ఏఐటీయూసీ కార్యదర్శి దాసరి వరహాలు, వేలూరు గ్రామ కార్యదర్శి ఎలికా శ్రీనివాసరావు, ఏఐవైఎఫ్ ఏరియా కార్యదర్శి కె.మల్లికార్జున,పట్టణ కన్వీనర్ బి రాంబాబు నాయక్,గిరిజన సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.శ్రీను నాయక్, వ్యవ సాయ కార్మిక సంఘం నాయకులు సొటుపల్లి నాగే శ్వరరావు, నాయకులు లక్ష్మీపతి పాల్గొన్నారు.

పంట పొలాలు పరిశీలించిన అధికారి

విశాలాంధ్ర-దాచేపల్లి : పల్నాడు జిల్లా వ్యవసాయాధికారి జగ్గారావు ఆదివారం దాచేపల్లి గ్రామీణ మండలానికి వచ్చారు. కృష్ణానదిలో వరద నీటి ప్రవాహంతో నీట మునిగిన పత్తి, మిర్చి, వరి తదితర పంటలను పరిశీలించారు. పంట నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక పంపుతామని ఆయన చెప్పారు. స్థానిక ఏఓ కంచర్ల వెంకటేష్, వ్యవసాయ విస్తరణాధికారి బ్రహ్మయ్య, వ్యవసాయ గ్రామ సహాయకులు వాణి, కవిత తదితరులు ఉన్నారు.

దసరా వేడుకల్లో జిల్లా జడ్జి సత్యశ్రీ

విశాలాంధ్ర-రెంటచింతల : దసరా సంబరాలలో భాగంగా నరసరావుపేట జిల్లా కోర్టు జడ్జి సత్యశ్రీ పాలువాయి జంక్షన్ కనకదుర్గా ఆలయాన్ని సందర్శించారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం నిర్వాహకులు స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. అన్నదాన కార్యక్రమానికి ఆర్థిక సహాయం అందజేశారు. కనకదుర్గ ఆదివారం భక్తులకు కాత్యాయని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చింది. రెంటచింతల వాసవిమాత అన్నపూర్ణాదేవి, సత్రశాల బ్రమరాంబ దేవతామూర్త చండీ దేవిరూపంలో దర్శనభాగ్యం కల్పించారు. పాలువాయి, తుమ్మకోట, రెంటచింతల, మంచికల్లు, జెట్టిపాలెం, పశర్లపాడు, గోలి, మిట్టగుడిపాడు, రెంటాల, గేటుగ్రామంలోనూ ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి.

డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ పోస్టర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర-మంగళగిరి : వైసీపీ నియోజకవర్గ కార్యాలయంలో ఆదివారం వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు ఆధ్వర్యంలో పార్టీ రూపొందించిన డిజిటల్ బుక్ క్యూ ఆర్ కోడ్ పోస్టర్‌ను పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యకర్తలపై జరిగిన అన్యాయాలను నమోదు చేసుకొని భవిష్యత్తులో న్యాయం సాధించేందుకు ఈ డిజిటల్ బుక్ ఉపయోగపడుతుందని నేతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బురవ ఉక్కు వేణుగోపాల్ స్వామి రెడ్డి, నాలి వెంకటకృష్ణ, తాడిబోయిన శివగోపయ్య, అమరా నాగయ్య, పచ్చల రత్నకుమారి, ఫిలోమినీ, డేవిడ్ రాజు, ఊట్లపాల శ్రీనివాసరావు, ఈపూరి ఆదాం, సుబ్బారావు(సుబ్బు), దర్శి రమేష్, శ్రీనివాస్ రాజు, మల్లేశ్వరరావు, జి.నాగిరెడ్డి, గంగాధర్ రావు, సురేంద్ర పాల్గొన్నారు.

శ్రీ మహా చండీదేవిగా కనకదుర్గమ్మ

విశాలాంధ్ర-దుర్గి : దసరా ఉత్సవాలలో భాగంగా దుర్గి యాదవుల వీధిలో మండపం ఏర్పాటు చేసి కనకదుర్గమ్మ అమ్మవారి ప్రతిమను నెలకొల్పారు. ఆరు రోజులుగా అర్చకులు అమ్మవారిని పలు రకాలుగా అలంకరించారు. ఆదివారం కనకదుర్గమ్మ శ్రీ మహా చండీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చింది. పుణ్య దంపతులు పీటలపై కుర్చున్నగా అర్చకులు దుర్గమ్మ దర్శనం సర్వపుణ్య ప్రదాయకమని ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు.

జర్నలిస్టుల పిల్లలకు శివశక్తి ఫౌండేషన్

మెరిట్ స్కాలర్‌షిప్‌లు అందజేత

విశాలాంధ్ర-వినుకొండ : ఇంటర్ నుంచి పీజీ వరకు చదివే జర్నలిస్ట్ మిత్రుల పిల్లలకు ప్రోత్సాహకంగా శివశక్తి ఫౌండేషన్ తరపున మెరిట్ స్కాలర్‌షిప్‌లు అందించడం ఎంతో సంతోషంగా ఉందని చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. 30ఏళ్ల తన రాజకీయ జీవితంలో ఎంతో ప్రోత్సాహం, సహకారం అందించిన వారిపై గౌరవసూచకంగానే ఈ నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. వచ్చే 5 ఏళ్లు కూడా ఇలానే ఇంటర్ నుంచి పీజీ వరకు చదివి జర్నలిస్టుల పిల్లలు ఒక్కొక్కరికీ రూ. 10వే ల చొప్పున ఉపకార వేతనాలు అందిస్తామన్నారు. వారంతా బాగా చదువుకుని భవిష్యత్‌లో ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నదే తన ఆకాంక్షగా పేర్కొన్నారు. ఆదివారం ఈ మేరకు శివశక్తి లీలా అండ్ అంజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 35 మంది విద్యార్థులకు రూ.10 వేలు చొప్పున అందజేశారు. అనంతరం మాట్లాడుతూ గత ప్రభుత్వం జర్నలిస్ట్‌లకు ఇంటి స్థలాల విషయంలోనూ అన్యాయం చేసిందని త్వరలో వారికి రెండు సెంట్ల పట్టాలు ఇస్తామన్నారు. జర్నలిస్టుల కాలనీని రాష్ట్రంలోనే మోడల్ కాలనీగా తీర్చిదిద్దే ప్రయత్నం చేస్తామన్నారు. జర్నలిస్టుల ఇతర పెండింగ్ సమస్యలు కూడా పరిష్కరిస్తామన్నారు. రూ. 210 కోట్లతో వినుకొండ పట్టణానికి శాశ్వతమంచినీటి పథకం తీసుకుని వస్తున్నామని, దానిద్వారా కొత్త కాలనీలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. ఇదే సమయంలో ఎన్నెస్పీ గ్రౌండ్‌లో ఇండోర్ స్టేడియం, పార్క్, షాదీఖానా, టీటీడీ కల్యాణ మండపం, గుర్రం జాషువా డిజిటల్ లైబ్రరీ, స్విమ్మింగ్‌పూల్, హోల్‌సేల్ కూరగాయల మార్కెట్‌తో భవిష్యత్ అవసరాలకు సరిపడిన రీతిలో తీర్చిదిద్దుతాం. రానున్న 5ఏళ్లలో రామలింగేశ్వ రస్వామి ఆలయం, ఘాట్ రోడ్ సహ ప్రతి పని పూర్తి చేస్తా. ఆ ఆలయాన్ని పర్యాటక క్షేత్రంగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు.ఈ కార్యక్రమంలో డీసీసీబీ ఛైర్మన్ మక్కెన మల్లికార్జున రావు, జనసేన నాయకులు నాగ శ్రీను రాయల్, తదితరులు పాల్గొన్నారు.

జాషువా ఆశయాలు ముందుకు తీసుకెళ్లదాం

ప్రజానాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి భైరాపట్నం రామకృష్ణ

విశాలాంధ్ర-అమరావతి : తన రచనల ద్వారా సమాజాన్ని చైతన్యవంతం చేయటంతో పాటు గబ్బిలంతో ప్రారంభించి వెన్నెలలా విహరిస్తూ కవి కోకిలగా ఆలాపన చేస్తూ ప్రజల హృదయాల్లో స్థిరత్వాన్ని పదిలపరుచుకున్న గుర్రం జాషువా ఆశయాలు, ప్రతి ఆలోచనను ముందుకు తీసుకెళ్లేందుకు కవులు, కళాకారులు, కళాభిమానులు ముందు పీఠికన నిలవాలని ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి భైరాపట్నం రామకృష్ణ పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రమైన అమరావతిలోని ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి కార్యాలయంలో ఏర్పాటు చేసిన గుర్రం జాషువా జయంతి కార్యక్రమంలో రామకృష్ణ మాట్లాడుతూ నేటికీ నాటికి ఏనాటికి సువర్ణ అక్షరాలతో లిఖింపబడినట్లు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిన సత్య హరిచంద్ర నాటకంలో కాటిసీను పద్యాలు సమాజానికి కళాకారులకి, కళా ప్రియులకు ఒక గీటు రాయి లాంటిదని అన్నారు. జాషువా రచనలలోని భావాలను ప్రతిఒక్కరూ పునికిపుచ్చుకొని సమాజాన్ని చైతన్యం చేసేందుకు కంకణబద్ధులు కావాలని పిలుపునిచ్చారు. సభకు ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి పెదకూరపాడు నియోజకవర్గ కార్యదర్శి మునగోటి శ్రీనివాసరావు అధ్యక్షత వహించి ప్రసంగించారు. సభలో పౌరాణిక రంగస్థలం నటులు కళాకారులు పాల్గొన్నారు. సభకు ముందు గుర్రం జాషువా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

అమ్మవారికి సారె సమర్పణ

విశాలాంధ్ర-దుగ్గిరాల: మండల పరిధిలోని చిలువూరు గ్రామంలో కొలువైన శ్రీ గంగానమ్మ దేవత దేవాలయ 13వ వార్షికోత్సవాలు కొనసాగుతున్నాయి. గ్రామానికి చెందిన రంగిశెట్టి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న వార్షికోత్సవాల్లో భాగంగా తొలి రోజు అమ్మవారికి మేళతాళాలు నడుమ సారెను సమర్పించి, తదుపరి పసుపు,కుంకుమ నీళ్లతో శ్రీ సూక్త మహాభిషేకం నిర్వహించారు. చివరి రోజు సోమవారం అమ్మవారికి 101 చీరలతో అలంకరణ,పుష్పాభిషేకం నిర్వహించనున్నారు.

అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ జేఏసీ రాష్ట్ర కమిటీ ఎన్నిక

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : గుంటూరు ఉద్యాన శాఖ మిని మీటింగ్ హాల్‌లో ఆదివారం జరిగిన ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ జేఏసీ రాష్ట్ర జనరల్ బాడీ సమావేశంలో రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. ఛైర్మన్‌గా దూసి భానుజీ రావు ఎన్నిక కాగా ప్రధాన కార్యదర్శిగా పి.గురునాథ్, వైస్ ఛైర్మన్‌లుగా కేవై దివాకర్ బాబు, రంగ భాస్కర్, జాయింట్ సెక్రటరీలుగా కె.రవికుమార్, బి.వరప్రత, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జి.మహేంద్ర, కోశాధికారిగా యు.అనిల్ కుమార్, సభ్యులుగా జీవీ సింహాచలం, కె.సుబ్బారాయుడు, ఐవీ కృష్ణరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా దూసి భానుజీ రావు మాట్లాడుతూ ఏళ్ల తరబడి ప్రభుత్వ శాఖలలో ఔట్‌సోర్సింగ్ సిబ్బంది చిత్తశుద్ధితో, క్రమశిక్షణగా తక్కువ వేతనానికి పనిచేస్తున్నారని వారందరికీ ఉద్యోగ భద్రత కల్పించేలా ఆప్కాస్ కంటే మెరుగైన వ్యవస్థను కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే గతంలో సర్ప్, మెప్మా ఉద్యోగులకి ఏ విధంగా హెచ్‌ఆర్ పాలసీని అమలు చేస్తున్నారో ప్రస్తుతం పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కూడా హెచ్‌ఆర్ పాలసీని అమలు చేయాలన్నారు. చాలీచాలని జీతాలతో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు నిలిపివేయడం బాధాకరమని, కూటమి ప్రభుత్వం మేనిఫెస్టోలో పెట్టిన విధంగా ఉద్యోగులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలుపరచాలని కోరారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం తప్పనిసరిగా అందరికీ కల్పించాలని, జీఓ 7 రద్దు చేస్తూ పీఆర్సీలో కేడర్ వారీగా జీతభత్యాలు అందించాలన్నారు. ఏపీఎస్ఆర్టీసీ, అటవీ శాఖ, వైద్య ఆరోగ్యశాఖ, గురుకులాలు తదితర శాఖలలో దళారీల వ్యవస్థలతో నలిగిపోతున్న వారందరినీ ఆప్కాస్ పరిధిలోకి తీసుకురావాలని లేదా ఆయా శాఖల ద్వారా ఉద్యోగులకు నేరుగా జీతాలు చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. గురునాథ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులందరికీ అండగా ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ జేఏసీ అండగా నిలబడుతుందని, సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తుందని హామీ ఇచ్చారు.

ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

- ప్రజారోగ్య పరిరక్షణకు ప్రభుత్వ ప్రాధాన్యత
- ఎమ్మెల్యేలు బోడె ప్రసాద్, కాగిత కృష్ణప్రసాద్
- వరల్డ్ హార్ట్ డే సందర్భంగా కామినేని హాస్పిటల్స్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ
- గుండె ఆరోగ్య పరిరక్షణ ప్రాధాన్యతను తెలియజెప్పేలా ప్రదర్శన

విశాలాంధ్ర - విజయవాడ స్పోర్ట్స్ : ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ఎమ్మెల్యే బోడే ప్రసాద్ అన్నారు. వరల్డ్ హార్ట్ డే సందర్భంగా కామినేని హాస్పిటల్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన ర్యాలీని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ తో కలిసి ఆయన ప్రారంభించారు. గుండె సంబంధిత వ్యాధులు, గుండె ఆరోగ్య సంరక్షణ గురించి అవగాహన కల్పిస్తూ కానూరు సెంటర్ నుంచి తాడిగడప వరకు ర్యాలీ నిర్వహించారు. ఆదివారం జరిగిన ఈ ర్యాలీ ప్రారంభ సందర్భంగా ఎమ్మెల్యే బోడే ప్రసాద్ మాట్లాడుతూ.. ఆధునిక జీవన విధానాల కారణంగా ప్రస్తుతం ప్రజలు చిన్న వయసులో అనారోగ్యం బారినపడుతున్నారని అన్నారు. తనకు తెలిసిన ఓ 32 ఏళ్ల యువకుడు ఇటీవల గుండె జబ్బుతో హఠాత్తుగా మరణించాడని తెలిపారు. అందుకే ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, తరచుగా వైద్య పరీక్షలు చేయించుకుంటూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజారోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని, ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ.. ఆరోగ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యనివ్వాలని సూచించారు. వ్యాయామం చేయడం, మంచి జీవన శైలిని అవలంబించడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని అన్నారు. వరల్డ్ హార్ట్ డే సందర్భంగా అవగాహన ర్యాలీని నిర్వహించిన కామినేని హాస్పిటల్స్ ను ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ అభినందించారు. కామినేనిలో అందుబాటులో ఉన్న అత్యాధునిక వైద్య సదుపాయాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన అన్నారు. కామినేని మెడికల్ డైరెక్టర్ ఎన్.ఆర్.ఎస్. వర్ధన్ పర్యవేక్షణలో జరిగిన ఈ అవగాహన ర్యాలీలో డాక్టర్ కళ్యాణ్ వెంకటేశ్వర్లు, డాక్టర్ ఆర్. అర్చన, డాక్టర్ భరత్, డాక్టర్ సురేష్, కామినేని క్లస్టర్ హెడ్ పి. సునీల్ కుమార్, మార్కెటింగ్ హెడ్ రమణారావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ దేశాల్లో యోగాకి ప్రత్యేక గుర్తింపు

- జాతీయ యోగాసన పోటీలు ప్రారంభోత్సవంలో ఉపసభాపతి రఘురామ కృష్ణరాజు, ఎంపీ కేశినేని శివనాథ్
- ఉత్సాహంగా పోటీ పడుతున్న క్రీడాకారులు

విశాలాంధ్ర-విజయవాడ స్పోర్ట్స్ :- ప్రపంచ దేశాల్లో యోగాకి ప్రత్యేక గుర్తింపు తెచ్చింది సాక్షాత్తు మన దేశ ప్రధాని నరేంద్ర మోదీ అని ఉపసభాపతి రఘురామ కృష్ణరాజు పేర్కొన్నారు. స్థానిక పీబీ సిద్ధార్థ ఆర్ట్ అండ్ సైన్స్ కళాశాల ప్రాంగణంలో నాలుగు రోజుల పాటు జరగనున్న 6వ జాతీయ జూనియర్, సీనియర్-సి యోగాసన ఛాంపియన్‌షిప్‌ను నేడు రఘురామ కృష్ణరాజు ముఖ్యఅతిథిగా హాజరై లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యోగా ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. అలాగే వ్యాధుల బారిన పడకుండా ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపవచ్చని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ యోగాకు ప్రాధాన్యతనిచ్చి సాధన చేయాలన్నారు. గౌరవ అతిథిగా హాజరైన ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) మాట్లాడుతూ, యోగాసనాలు శారీరక, మానసిక రోగ్యానికి పునాది అన్నారు. విజయవాడలో జాతీయ స్థాయి పోటీలు జరగడం గర్వకారణమన్నారు. యోగాసన క్రీడలను అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకొచ్చింది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలేనని పేర్కొన్నారు. రాష్ట్ర యోగాసన స్పోర్ట్స్ సంఘం గౌరవాధ్యక్షుడు గొట్టిపాటి వెంకట రామకృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ, ఈ పోటీల్లో దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి సుమారు 1500 మందికి పైగా క్రీడాకారులు హాజరయ్యారన్నారు. ముందుగా క్రీడాకారులు చేసిన గౌరవ వందనాన్ని అతిథులు స్వీకరించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, రాష్ట్ర యోగాసన స్పోర్ట్స్ సంఘం అధ్యక్షురాలు ఎ.రాధిక, ఉపాధ్యక్షుడు రాజశేఖరరెడ్డి, ప్రధాన కార్యదర్శి పి.ప్రేమ్‌కుమార్, యోగాసన భారత్ స్పోర్ట్స్ కన్సల్టెంట్ శ్రేయస్ మార్కండేయ, తదితరులు పాల్గొన్నారు.

నగరవాసులను ఆకర్షిస్తున్న లేపాక్షి -దసరా డిస్కౌంట్ సేల్...



విశాలాంధ్ర,విజయవాడ (గాంధీనగర్) : ఆంధ్రప్రదేశ్ హ్యాండీ క్రాఫ్ట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నగరంలోని లేపాక్షి దుకాణాల్లో ఏర్పాటు చేసిన ప్రదర్శన, విక్రయాలకు విశేష స్పందన వస్తోందని మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ విశ్వ తెలిపారు. ఉడ్ కార్వింగ్, బొబ్బిలి వీణ, ఏటికొప్పాక, కొండపల్లి బొమ్మలు, కలంకారి చీరలు, బెడ్ షీట్స్, ఇత్తడి విగ్రహాలు, లోహ కళాఖండాలు, రాగి వస్తువులు, ఇంకా మరెన్నో సరికొత్త డిజైన్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. డిస్కౌంట్ సేల్లో భాగంగా అక్టోబరు 1 వ తేది వరకు ప్రతీ వస్తువు కొనుగోలుపై ప్రత్యేక డిస్కౌంట్ ఇస్తున్నట్లు తెలిపారు. గాంధీనగర్, ఐలాపురం ఎదురుగా ఉన్న లేపాక్షి షోరూమ్ ను ప్రతి ఒక్కరూ సందర్శించి ప్రదర్శనలలో ఉన్న అపురూప కళాఖండాలను కొనుగోలు చేసి హస్త కళకారుల జీవనోపాధికి సహకరించాలని కోరారు.

శ్రీకృష్ణాశ్రమంలో ముగిసిన శ్రీమద్భాగవతసప్తాహం

విశాలాంధ్ర, కూచిపూడి : కృష్ణాజిల్లా మొవ్వ మండ లంలో ఆధ్యాత్మిక కేంద్రమైన పెదముత్తేవి శ్రీకృష్ణాశ్రమం లో ఈనెల 22వ తేదీ నుంచి కొనసాగుతున్న శ్రీమద్భాగ వత సప్తాహ పఠనం(28వ తారీకు) ఆదివారంతో ముగి శాయి. ఈ సందర్భంగా ముగింపోత్సవం వేడుకలలో భాగంగా సూర్య నమస్కారాలు, శ్రీమద్ భాగవత పారాయణ, సరస్వతీ పూజ నిర్వహించారు. శ్రీమాన్ ఎక్కిరాల కృష్ణమాచార్యుల శతజయంతి వేడుకల సందర్భంగా శ్రీయతీంద్ర సేవా సమితి మాస్టర్ ఈ.కే ఆధ్యాత్మిక సేవా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో వారం రోజులు పాటు ఈ కార్యక్రమాలను నిర్వహించారు మాస్టర్ ఈ కే ఆధ్యాత్మిక సేవా సంస్థ అధ్యక్షులు ఎక్కిరాల అనంతకృష్ణ గురూజీ, ముముక్షుజన మహాపీఠాధిపతులు ముత్తేవి గౌర కృష్ణ గురూజీ దివ్య నిర్వహణలోవారం రోజులపాటు నిర్వహించిన ఆధ్యాత్మిక కార్యక్రమాలు అంగరంగ వైభవంగా జరిగాయి.

సాఫ్ట్ టెన్నిస్ చాంపియన్లుగా ఎన్టీఆర్, కృష్ణాజిల్లాలు

- ముగిసిన ఏపీ సీనియర్ సాఫ్ట్ టెన్నిస్ టోర్నీ

విశాలాంధ్ర విజయవాడ స్పోర్ట్స్ : ఆంధ్రప్రదేశ్ సీనియర్ ఇంటర్-డిస్ట్రిక్ట్ సాఫ్ట్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్ విజయవాడలో ముగిసింది. ఎన్టీఆర్, కృష్ణాజిల్లాలు వరుసగా పురుషుల, మహిళల టీమ్ ఈవెంట్‌లలో ఛాంపియన్‌లుగా నిలిచాయి. రెండు రోజుల టోర్నమెంట్ ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియం టెన్నిస్ కాంప్లెక్స్‌లో జరిగింది. జట్టు టైటిళ్లతో పాటు, అనంతపురంకు చెందిన ఎస్.ఆరోన్ రొనాల్డియన్, కృష్ణాజిల్లాకు పి.లావణ్య వ్యక్తిగత పురుషుల, మహిళల సింగిల్స్ ఛాంపియన్‌షిప్‌లను కైవసం చేసుకున్నారు. పురుషుల టీమ్ ఈవెంట్‌లో, ఎన్టీఆర్ జిల్లా అగ్రస్థానంలో నిలిచింది, తరువాత శ్రీకాకుళం, కృష్ణా, కాకినాడ రెండవ, మూడవ, నాల్గవ స్థానాల్లో నిలిచాయి. మహిళల టీమ్ విభాగంలో, కృష్ణజిల్లా మొదటి స్థానాన్ని దక్కించుకుంది, ఎన్టీఆర్, కాకినాడ, గుంటూరు మొదటి నాలుగు స్థానాల్లో నిలిచాయి. పురుషుల సింగిల్స్‌లో ఎస్. ఆరోన్ రొనాల్డియన్ (అనంతపురం) మొదటి స్థానంలో, పి భాను ప్రకాష్ (అనంతపురం) రెండవ స్థానంలో, పివి చిన్మాన్ (ఎన్టీఆర్) మూడవ స్థానంలో, ఎం యుధీర్ (కృష్ణా) నాల్గవ స్థానంలో నిలిచారు. మహిళల సింగిల్స్‌లో పి లావణ్య (కృష్ణ) అగ్రస్థానంలో నిలిచారు, తరువాత ఎవస్ వైశాలి (ఎన్టీఆర్), ఎం భావన, ఎన్ అనుష (కృష్ణా) ఉన్నారు. ఛాంపియన్‌షిప్ బహుమతులను స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ తరఫున టోర్నమెంట్ పరిశీలకుడు కె.జగదీష్ మరియు ఆంధ్రప్రదేశ్ సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ చైర్మన్ దారం నవీన్ కుమార్ అందజేశారు.

21వ శతాబ్దంలో ఆయుర్వేదం..

ఆధునిక జీవనశైలి కోసం ప్రాచీన విజ్ఞానం

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 23న ఆధునిక ప్రపంచంలో ఇప్పటికీ ఎంతో ప్రాముఖ్యత కలిగిన ప్రాచీన జీవన విజ్ఞానాన్ని గుర్తించి, ప్రోత్సహించడానికి జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని జరుపుకుంటారు. ఒత్తిడి, నిద్ర సమస్యలు, ఆందోళన, బరువు సమస్యలు, హార్మోన్ల అసమతుల్యత ఆధునిక జీవనశైలిని నిర్వచిస్తున్న తరుణంలో, చాలామంది సంపూర్ణ పరిష్కారాల కోసం ఆయుర్వేదం వైపు మొగ్గు చూపుతున్నారు. మనస్సు, శరీరం, ఆత్మ సమతుల్యతలో పాతుకుపోయిన ఆయుర్వేదం, నేటి వేగవంతమైన ప్రపంచంలో స్థితిస్థాపకతకు మద్దతు ఇవ్వడానికి, ఉదయాన్నే నిద్రలేవడం, యోగా, ధ్యానం, సాత్విక ఆహారాలు, బాదం వంటి పోషక ఎంపికల వంటి చైతన్యవంతమైన అలవాట్లను ప్రోత్సహిస్తుందని ఆయుర్వేద నిపుణురాలు డా. మధుమిత కృష్ణన్ పేర్కొన్నారు.

కొత్త రంగుల్లో సామ్సంగ్ గెలాక్సీ ఏ56 5జీ, గెలాక్సీ ఏ36 5జీ

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): భారతదేశపు అతిపెద్ద కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ సామ్సంగ్, పండుగ సీజన్‌లో ట్రెండీ స్మార్ట్‌ఫోన్‌లను కొనుగోలు చేయాలనుకునే వినియోగదారుల కోసం గెలాక్సీ %వ%56 5జీ, గెలాక్సీ ఏ36 5జీకి యువతను ఆకట్టుకునే రంగులను జోడించినట్లు ప్రకటించింది. గెలాక్సీ ఏ56 5జీ ఇప్పుడు ఆసమ్ పింక్ రంగులో, గెలాక్సీ ఏ36 5జీ ఆసమ్ లైమ్ రంగులో అందుబాటులో ఉన్నాయి. వినియోగదారులకు మరిన్ని ఎంపికలను అందిస్తున్నాయి. గెలాక్సీ ఏ56 5జీ, గెలాక్సీ ఏ36 5జీతో, సామ్సంగ్ ఫ్లాగ్‌షిప్ పరికరాల నుండి అత్యంత ఇష్టపడే ఏఐ ఆవిష్కరణలను ప్రజాస్వామీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. పరిమిత కాలం వరకు, కస్టమర్‌లు గెలాక్సీ ఏ56 5జీ, గెలాక్సీ ఏ36 5జీపై జీరో డౌన్ పేమెంట్, జీరో వడ్డీ, జీరో అవాంతరాలను ఆస్వాదించవచ్చు.

'ప్రాజెక్ట్ క్షీర్‌సాగర్'ను ప్రారంభించిన అబాట్

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): భారతదేశంలో పెరుగుతున్న పోషక ఉత్పత్తుల డిమాండ్‌ను తీర్చడంలో సహాయపడటానికి, ప్రపంచ ఆరోగ్య సంరక్షణ సంస్థ అబాట్, అధిక నాణ్యత గల పాల సరఫరా చాలా అవసరమని గుర్తించింది. ఈ లక్ష్యాన్ని దృష్టిలో ఉంచుకుని, 2022లో అబాట్ అంతర్జాతీయ లాభాపేక్షలేని సంస్థ టెక్నోసర్వ్ భాగస్వామ్యంలో "ప్రాజెక్ట్ క్షీర్‌సాగర్"ను ప్రారంభించింది. ఈ దీర్ఘకాలిక అభివృద్ధి కార్యక్రమం భారతదేశంలోని పాడి రైతులకు మద్దతు ఇవ్వడమే కాకుండా, వారి జీవనోపాధిని మెరుగుపరచడం, స్థిరమైన ముడి పాల సరఫరా గొలుసును ఏర్పరచడం లక్ష్యంగా పెట్టుకుంది. అబాట్ పోషక ఉత్పత్తులపై ఆధారపడే భారతీయ రైతులు, కుటుంబాల జీవితాల్లో ఈ కార్యక్రమం చూపి స్తున్న సానుకూల ప్రభావాన్ని పంచుకుంటుంది. మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, కర్ణా టక, తమిళనాడుల్లో ప్రారంభించబడిన ప్రాజెక్ట్ క్షీర్‌సాగర్, బ్యాంకు ఖాతాలను తెరవడానికి, ఉపాధి అవకాశాలను కొనసాగించడానికి, వారి వ్యాపారాన్ని పెంచుకోవడానికి ఆర్థిక అక్షరాస్యత, పాడి పరిశ్రమ నిర్వహణ ఉత్తమ పద్ధతుల్లో శిక్షణ పొందడంలో రైతులకు సహాయం చేయడం ద్వారా వారిపై పెట్టుబడి పెడుతుంది.

విశాలాంధ్ర

డాక్టర్ మణీష్ డయాగ్నొస్టిక్ సెంటర్‌లో అందుబాటు ధరల్లో వైద్య పరీక్షలు

విశాలాంధ్ర- గుంటూరు వైద్యం : గుంటూరు నగరం, పరిసర ప్రాంత ప్రజలకు అందుబాటు ధరల్లో నాణ్యమైన అన్ని రకాల వైద్య పరీక్షలు రైలు పేటలోని 'డాక్టర్ మణీష్ డయాగ్నోస్టిక్ సెంటర్' నందు చేయనున్నట్లు ఆ సెంటర్ నిర్వాహకులు, పెథాలజిస్ట్ డాక్టర్ మణికంఠ వీశం పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఉదయం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అధునాతన పరికరాలతో పరీక్షలు మా డాక్టర్ మణీష్ డయాగ్నోస్టిక్ సెంటర్ నందు చేయబడతాయని, నాణ్యతతో కూడిన పరీక్షలతో పాటు వేగవంతంగా బ్లడ్ రిపోర్టులను అందజేస్తామన్నారు. అవసరమైన రోగులకు ఇంటి వద్ద కూడా ఎన్ఏబిఎల్, పెథాలజీ, మైక్రోబయాలజీ, క్లినికల్, ఇమ్యునాలజీ, హెమటాలజీ, హిస్టోపెథాలజీ, సిస్టోపెథాలజీ తదితర అన్ని వైద్య పరీక్షలు అవసరమైన పేషంట్లకు తమ ఇంటి వద్దే చేయబడతాయన్నారు. అవసరత ఉన్న వారు డాక్టర్ మణీష్ డయాగ్నోస్టిక్ సెంటర్ ను ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 9 గంటల వరకు మా సెంటర్ ను గానీ లేదా 96037 25835 నెంబర్ ను సంప్రదించాలని డాక్టర్ మణికంఠ వెల్లడించారు. పేషంట్ల ఆరోగ్య పరిరక్షణ నిమిత్తం కల్పిస్తున్న ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. వైద్య పరీక్షలు, రోగ నిర్ధారణ పరీక్షలు బహు భారమైన ఇతరుల ఆధునిక పరికరాలతో ప్రజలకు అందుబాటు ధరలలో వైద్య పరీక్షలు చేయటం మా ప్రధానమైన కర్తవ్యమన్నారు. పేద ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తున్న ప్రభుత్వానికి తోడు తమ వంతు బాధ్యతగా సామాన్యులకు కూడా విఐపీ తరహాలో నేడు అందుబాటులో ఉన్న అత్యాధునిక సాంకేతిక పరికరాలతో వైద్య పరీక్షలు చేయటం మా బాధ్యతగా స్వీకరిస్తున్నట్లు డాక్టర్ మణికంఠ వెల్లడించారు.

ప్రజల గుండెల్లో చిరంజీవిగా భగత్ సింగ్

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : భారత మాత విముక్తి కోసం కేవలం 23 సంవత్సరాల వయసులోనే నవ్వుతూ ఉరికొయ్యను ముద్దాడిన భగత్ సింగ్ దేశ ప్రజల గుండెల్లో చిరంజీవిగా నిలిచారని విద్యావేత్త ఇ. చంద్రయ్య ప్రశంసించారు. భావి తరాలకు దిక్సూచిగా భగత్ సింగ్ కొనసాగుతున్నా రన్నారు. కొత్తపేట కూడలిలోని భగత్ సింగ్ విగ్రహానికి అవగాహన సంస్థ సభ్యులు నివాళులర్పించారు. అనంతరం అవగాహన సంస్థ కార్యాలయంలో సభ నిర్వహించారు. భగత్ సింగ్ జయంతి కార్యక్రమానికి విద్యావేత్త ఆర్.వి సింగరయ్య అధ్యక్షత వహించారు. విద్యావేత్త ఇ.చంద్రయ్య మాట్లాడుతూ భగత్ సింగ్ జ్వలించే నిప్పు కణిక, బ్రిటిష్ సామ్రాజ్యవాదుల పాలిట సింహ స్వప్నంగా నిలిచారన్నారు. ఆనాడు ఇంక్విలాబ్ జిందాబాద్ అని నినదిస్తూ.. దేశ స్వాతంత్రం కోసం తెల్లదొరలపై భగత్ సింగ్ నాయకత్వంలో జరిగిన తిరుగుబాటు యావత్ దేశాన్ని ఆకర్షించిందన్నారు. భరతమాత విముక్తి కోసం, దేశం కోసం, జనం కోసం మరణించిన ధైర్యశాలి, త్యాగశీలి, వెర పెర గని విప్లవ సేనాని భగత్ సింగ్ అన్నారు. ప్రముఖ యోగాచార్యులు అచ్యుత ఇందుశేఖర్ మాట్లాడుతూ భగత్ సింగ్ ఒక వ్యక్తి కాదు, అతనొక మహా విప్లవ శక్తి అని, ఒక సిద్ధాంతానికి ఒక మార్గానికి త్యాగధనుల వారసత్వానికి అతను ప్రతీకగా నిలిచాడన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు ముప్పాళ్ళ ప్రసాదరావు, పి.జనార్ధనరావు, పీటర్ తదితరులు పాల్గొన్నారు.

విశ్వకవి గుర్రం జాషువా జయంతి

విశాలాంధ్ర-దాచేపల్లి : విశ్వకవి గుర్రం జాషువా జయంతి వేడుకలను ఆదివారం నారాయణపురంలో పలు చోట్ల ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహంతో పాటు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దీనిలో భాగంగానే పల్నాడు బలహీనవర్గాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి టీడీపీ పొలకమండలి సభ్యుడు జంగా కృష్ణమూర్తి ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. కౌన్సిలరు షేక్ షరీఫ్, అంజుమన్ కమిటీ అధ్యక్షుడు మౌలానా ముస్తఫా, మౌలానా ఫారూక్, మాతంగి సత్యానందం, చిలుముల దుర్గారావు, గద్దల వేదమణి, గరికపాటి వెంకట్ కుమార్, పఠాన్ రహీంతో పాటు పలువురు పాల్గొన్నారు. అదేవిధంగా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో కూడా ఆ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

డిజిటల్ బుక్ బూజు పట్టి పోవాల్సిందే, జగన్ మళ్లీ గెలవడం కల్ల: జీవీ

విశాలాంధ్ర - వినుకొండ : వైకాపా డిజిటల్ బుక్ పులిని చూసి నక్క వాత పెట్టుకున్నట్లు ఉందని వినుకొండ ఎమ్మెల్యే, చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు ఎద్దేవా చేశారు. జగన్, వైకాపా మళ్లీ అధికారంలోకి రావడం కల్ల అని గుర్తుంచుకోవాలి. మరీ ముఖ్యంగా మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఈర్ష్య, ద్వేషాలతో చేసే అసత్య ప్రచారాల్ని ప్రజలు ఎవరూ నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. వాళ్లు అధికారంలో ఉన్నప్పుడు జరిగిన వాటిని కూడా తెలుగుదేశం ప్రభుత్వంపైకి నెట్టడం, చేయని తప్పులకు బురద జల్లాలని చూడడం ఇకనైనా కట్టి పెట్టాలన్నారు. జీవీ అంజనేయులు కంపెనీలకు 100కోట్ల రాయితీలు ఇచ్చారని ఎప్పుడో ఆరో పణలు చేశారని, ఇప్పటికీ ఒక్కటైనా నిరూపించ గలిగారా అని ప్రశ్నించారు. అయిదేళ్లు అధికారం ఇచ్చిన ప్రజల్ని నిలువునా మోసం చేసి, జగనన్న కాల నీల పేరిట వందలకోట్లు దండుకున్న వ్యక్తి ఇప్పుడు తన గురించి మాట్లాడడం విడ్డూరంగా, వింతగా ఉందని ఎద్దేవా చేశారు. జాలపాలెంలో ఇళ్లకు నోటీసులు, కోర్టుకు వెళ్లడం అన్నీ వైకాపా హయాంలోనే జరిగినా.. దానిని కూడా తమపై నెట్టాలని చూడడం దుర్మార్గం కాక ఏం అనాలని నిలదీశారు. ఆదివారం మాజీ ఎమ్మెల్యే బొల్లా చేసిన ఆరోపణలపై ఈ మేరకు స్పందించిన చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు పూర్తి వివరాలతో కౌంటర్ ఇచ్చారు. తమ శివశక్తి బయో గురించి కూడా బొల్లా నోటికి వచ్చింది మాట్లాడుతున్నారని, నిజానికి కూటమి ప్రభుత్వంలో ఉన్న చాలామంది ఎమ్మెల్యేల గురించి తమ సంస్థ గురించే తెలియదన్నారు. దశాబ్దాల కష్టంతో అభివృద్ధి చేసుకున్న కంపెనీపై రైతుల్లో ఉన్న నమ్మకమే ఆధారంగా ఇంతకాలంగా తమ వ్యాపారాలు కొనసాగుతున్నాయన్నారు. ఇదే వైకాపా అధికారంలో ఉన్నప్పుడే జీవీ అంజనేయులు సంస్థలు వంద కోట్లకు పైగా వ్యాపారం పెంచుకున్నాయన్నారు.

2047 వరకు ఎన్డీఏ కూటమిదే అధికారం

2047 వరకు కూటమే అధికారంలో ఉంటుంది. డబుల్ ఇంజిన్ సర్కారే దూసుకు పోతుంది. 2019లో జరిగిన పొరపాటును సరిదిద్దటానికే కూటమికి అధికారం ఇచ్చారు. అదే ప్రజలు మీకు ఒక్క అవకాశం ఇస్తే దుర్వినియోగం చేసుకున్నారు. కల్తీ మద్యంతో ప్రజల ప్రాణాలు తీశారు. ప్రజలు ఇచ్చిన ఛాన్స్‌ను వేల కోట్లు దండుకోవడానికి వాడుకున్నారు. అలాంటి మీకు మళ్లీ ఏం చూసి ప్రజలు అవకాశం ఇస్తారు. మీరు చేసిన తప్పులు. అరాచకాలకు మళ్లొచ్చే ఛాన్స్ లేదు.

చంద్రబాబు, లోకేష్ గురించి మాట్లాడే స్థాయి బొల్లా బ్రహ్మనాయుడిది కాదు..

జాలపాలెం విషయంలో తెలుగుదేశం ప్రభుత్వంపై బురదజల్లడానికి సిగ్గు ఉండాలి. అక్కడ నోటీ సులు ఇచ్చింది, కోర్టులు వెళ్లింది అన్నీ వైకాపా హయాం లో జరిగితే కూటమి ప్రభుత్వం, జీవీ ఆంజనే యులపై తోసేయడానికి సిగ్గు ఉండాలి. తప్పుడు ప్రచారాలకు ఒక హద్దు ఉండాలి. నోరు తెరిస్తే అబద్ధాలు మానుకోవాలి. ఈర్ష్య, ద్వేషాలతో బొల్లా మాట్లాడే మాటల్ని ప్రజలు నమ్మరు. గతంలోనే ఇలానే జీవీ ఆంజనేయులు 100కోట్లు సబ్సిడీ పొందారని తప్పుడు ప్రచారం చేశారు. కానీ ఏదీ నిరూపించలేక పోయారు. అధికారంలో ఉండి వినుకొండకు పైసా పని చేయ లేదు, కొండపైకి ఘాట్ రోడ్ వేయలేదు, ఎన్నెస్పీ మైదానంలో ఒక్క ఇటుక పెట్టలేదు. జగనన్న కాలనీల ముసుగులో 100 ఎకరాలకు పైగా ఎకరం 18కోట్లకు పైగా 5 వేలమందిని ముంచేసింది బొల్లా మరిచిపోతే ఎలా? అని జీవీ ఆంజనేయులు ప్రశ్నించారు.

రికార్డుల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ: ఎస్పీ

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : పోలీస్ స్టేషన్లలో రికార్డుల నిర్వహణ పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. గుంటూరు ఈస్ట్ పోలీస్ సబ్ డివిజన్ పరిధిలోని పాత గుంటూరు పోలీస్ స్టేషన్‌ను ఆయన ఆదివారం సందర్శించారు. పలు అంశాలను సమీక్షించారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు, సిబ్బందికి ఎస్పీ పలు సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి, శుభ్రత, భద్రతపై దృష్టి పెట్టాలని అన్నారు. పోలీస్ సిబ్బందితో వారి విధుల నిర్వహణపై ఆరా తీశారు. రికార్డుల నిర్వహణను పరిశీలించి, ఎప్పటికప్పుడు క్రమపద్ధతిలో సక్రమంగా నమోదు చేయాలని ఆదేశించారు. ప్రజలు తమ సమస్యలు స్వేచ్ఛగా చెప్పుకునేలా స్టేషన్లలో సౌకర్యవంతమైన వాతావరణం ఉండాలని సూచించారు. విజిబుల్ పోలీసింగ్, రాత్రి గస్తీని పటిష్టపరచి, శాంతిభద్రతల పరిరక్షణలో ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఆర్టీసీ బస్టాండు, పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఉంచి, అసాంఘిక, చట్టవ్యతిరేక కార్యకలాపాలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఈస్ట్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్, ఎస్సీ సిఐ అలహరి శ్రీనివాస్, పాత గుంటూరు సీఐ వెంకట ప్రసాద్, ఎస్సైలు ప్రసాద్, రెహమాన్, వెంకటేశ్వర్లు, ఏఎస్సై శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అఖండ పల్నాటి స్థాపకులు అనుగు రాజు యాదవ్ విగ్రహావిష్కరణ

విశాలాంధ్ర-పిడుగురాళ్ల : పల్నాటి చరిత్ర గుర్తులు భావితరాలకు తెలిపేలా 11వ శతాబ్దపు అఖండ పల్నాడు రాజ్య పాల కులు అనుగురాజు యాదవ్ విగ్రహ ఏర్పా టు అభినందనీయమని రాష్ట్ర గృహని ర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. పట్టణంలోని గంగమ్మ గుడి దేవస్థానం వద్ద 11వ శతాబ్దంలో అఖండ పల్నాడును స్థాపించి పాలించిన రాజు అనుగురాజు యాదవ్ కాంశ్య విగ్రహావిష్కరణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మంత్రి కొలుసు పార్థసారథి, ఎమ్మెల్యేలు యరపతినేని శ్రీనివాసరావు, మద్దులూరి మాలకొండయ్య యాదవ్(చీరాల), టీటీడీ సభ్యులు జంగా కృష్ణమూర్తి, రాష్ట్ర పర్యాటక సంస్థ అభివృద్ధి చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ, రాష్ట్ర యాదవ సంక్షేమ అభివృద్ధి సంస్థ చైర్మన్ గోళ్ళ నరసింహులు యాదవ్, డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు యాదవ్ పాల్గొని వెయ్యేళ్ళ నాటి యాదవ రాజులు స్థాపించి, పాలించిన పలనాటి ఖ్యాతిని గుర్తు చేసుకున్నారు. పలనాడును గత ప్రాభవాన్ని చాటి చెప్పేలా అశాంతిని తొలగించి అభివృద్ధిని కల్పించేలా పనిచేస్తామని ఎమ్మెల్యే శ్రీనివాసరావు తెలిపారు. కలియుగ దైవం వెంకటేశ్వరుని ఆలయ ద్వారాలు తీసే భాగ్యం యాదవులకు దక్కటం దేవుని వరముగా ఎమ్మెల్యే పేర్కొన్నారు. పల్నాటి చరిత్ర ఆనవాళ్లను భావితరాలకు తెలిపేలా చేపట్టిన కార్యకలాపాలకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తుంటానని జంగా కృష్ణమూర్తి తెలిపారు. అనుగురాజు యాదవ్ విగ్రహ ఏర్పాటుకు పూనుకున్న కమిటీ సభ్యులను అతిథులు ఘనంగా సత్కరించారు.

శ్రీ విశ్వకర్మ పీఠం నందు చండీహోమం

విశాలాంధ్ర-గుంటూరు సిటీ : స్థానిక ఏటీ అగ్రహారం 7వ లైన్‌లో గల శ్రీ విశ్వకర్మ పీఠం నందు దసరా మహోత్సవ వేడుకలలో భాగముగా లోక కళ్యాణార్థం శ్రీ విశ్వకర్మ పీఠం పీఠాధిపతులు శ్రీ యోగి మహేశ్వరానంద గురూజీ ఆధ్వర్యంలో ఉదయం 5 గంటల నుండి అమ్మవారి సుప్రభాత సేవ, వేద పారాయణ, గణపతి పూజ, పుణ్యాహవా చనం, కంకణ ధారణ, మండపారాధన, నవగ్రహ పూజ, అష్టదిక్పాలక పూజ, చండి హోమం శ్రీ విశ్వకర్మ పీఠం కార్య నిర్వహణ అధికారి నందిపాటి ధన లక్ష్మి పర్యవేక్షణలో ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భముగా శ్రీ విశ్వకర్మ పీఠం పీఠాధిపతులు మాట్లాడుతూ ప్రతి ఇంట సంతోషం, ఆనందం వెల్లి విరియాలంటే స్వయంకృషితో బాటు భగవంతుని అనుగ్రహం ఉండాలన్నారు. భగవంతుని అనుగ్రహం లేనిదే చేబట్టే పనికి సంపూర్ణత్వం సిద్దించదన్నారు. జ్యోతిష్య శాస్త్రంలో మన యొక్క ఉనికి స్థిరత్వము సంపాదించాలి అంటే కొన్ని రకాల దోషాలు అనగా వివాహం కాకపోవడం, సంతానం లేకపోవడం, ఉద్యోగములో స్థిరత్వం లేకపోవడం మానవుని కలలను, ఆశయాలను నిర్వీర్యం చేస్తూ మానవుని అధోగతి పాలు చేస్తున్నాయని, అమ్మ దయ ఉంటే అన్ని ఉన్నట్లే అనే సత్య ప్రామాణికాన్ని అనుసరించి ఈ పవిత్ర దసరా మహోత్సవాలలో సరదాలు, వినోదాలకు కేటాయించకుండా దసరా మహోత్సవాని అత్యంత భక్తి శ్రద్ధలతో ఎవరు అమ్మని శరణు వేడుకొంటారో అమ్మ దయతో అనుగ్రహంతో మనం కోరుకునే ధర్మమైన కోరికలు ఫలించును అని తెలియచేసారు. ఈ చండీహోమం నందు తాళ్లూరి కృష్ణారావు దంపతి సమేతముగా పాల్గొని పూజ క్రతువులు నిర్వహించారు. ప్రత్యేక అతిథులు ఆనంద్ నాథ్ జీ విచ్చేసారు. మయబ్రహ్మం, సవరం రోహిత్, రియల్ బూమ్ వ్యవస్థాపకులు శ్రీనివాసు, భక్తులు విశేషముగా పాల్గొని పూర్ణాహుతి సమర్పించారు.